www.peoplesnews.in

హైదరాబాద్ **పీపుల్స్ న్యూస్** దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 81 బుధవారం, ఆగస్టు 05, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

## తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



**'అమరజీవి జలధార' గోదావరి జిల్లాల తాగునీటి సమస్యకు పరిష్కారం: పవన్ కల్యాణ్**

**జల్ జీవన్ మిషన్ కింద అమలవుతున్న 'అమరజీవి జలధార' ప్రాజెక్టు**

**తీరప్రాంతాల్లోని 33 లక్షల మందికి సురక్షిత మంచినీటిని అందించడమే లక్ష్యం**

**నిర్దేశిత వ్యవధిలోనే నిర్మాణాలను పూర్తి చేయాలన్న పవన్**

**అమరావతి,ఆగస్టు 4 :** జల్ జీవన్ మిషన్ కింద చేపడుతున్న 'అమరజీవి జలధార' ప్రాజెక్టు ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతుందని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మంగళగిరిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఈ ప్రాజెక్టు **మిగతా 2లో...**

# పారదర్శకంగా పోలీస్ ఉద్యోగ నియామకాలు

## - పరీక్షల నిర్వహణపై ప్రత్యేక నిఘా

### - అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

**హైదరాబాద్,ఆగస్టు 4 :** పోలీస్ ఉద్యోగ నియామకాల భర్తీ ప్రక్రియలో ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. 7,437 పోస్టుల భర్తీ ప్రక్రియకు ఎలాగైనా భంగం కలిగించాలని కొన్ని రాజకీయ పార్టీలతో పాటు ఇతర శక్తులు ప్రయత్నిస్తున్నట్లు నిఘా వర్గాలు సీఎం దృష్టికి తీసుకెళ్లాయి. ఈ నేపథ్యంలో డీజీపీ సీవీ ఆనంద్ తో పాటు ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. నియమ, నిబంధనలనుసరించి ఎలాంటి లోపాలకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. ప్రశ్నపత్రాల తయారీ, ముద్రణ, రవాణాతో పాటు అన్ని ప్రక్రియల్లో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని డీజీపీని ఆదేశించారు. కోచింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణపై సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో ఎలాంటి దుష్ప్రచారం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేసే దళారులు, నకిలీ వెబ్ సైట్లు, సోషల్ మీడియా అకౌంట్లపై సైబర్ క్రైమ్ విభాగంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణ పూర్తయ్యే వరకు సైబర్ సెక్యూరిటీ, ఇంటలీజెన్స్ విభాగం పూర్తి **మిగతా 2లో...**



## ట్రంప్ తాజా సుంకాలు చట్టవిరుద్ధం

### కోర్టులో వ్యాజ్యం వేసిన అమెరికా రాష్ట్రాలు



**వాషింగ్టన్,ఆగస్టు 4 :** భారత్ సహా 60 వాణిజ్య భాగస్వామ్య దేశాల నుంచి దిగుమతి అవుతున్న వస్తువులపై 10 నుంచి 12.5 శాతం వరకూ కొత్తగా సుంకాలు విధించాలని డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై అమెరికాలోని ఇరవై ఐదు రాష్ట్రాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. ఈ సుంకాలు అక్రమమైనవని, ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు కొట్టివేసిన దిగుమతి పన్నుల స్థానంలో ట్రంప్ ప్రభుత్వం వీటిని తీసుకొచ్చే ప్రయత్నం చేసిందని ఆరోపించాయి. సుంకాల విధింపును కొట్టివేయాలని, వాటిని చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించి ఇప్పటికే వసూలు చేసిన సొమ్మును తిరిగి వాపసు చేసేలా చూడాలని యూఎస్ కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్‌లో దాఖలు చేసిన వ్యాజ్యంలో ఆ రాష్ట్రాలు అభ్యర్థించాయి. 59 రాష్ట్రాలు, యూరోపియన్ యూనియన్‌పై గత నెలలో విధించిన సుంకాలు అమెరికా దిగుమతు లలో 99.4 శాతం వాటాను కలిగి ఉన్నాయని రాష్ట్రాలు వాదించాయి. కార్మికులతో బలవంతంగా పనులు చేయించి తయారు చేసిన వస్తువుల దిగుమతులను ఆపాలని కోరినప్పటికీ ఆయా దేశాలు పట్టించుకోలేదని ట్రంప్ ప్రభుత్వం చెబుతోంది. 'సుప్రీంకోర్టులో ఎదురు దెబ్బ తగిలిన తర్వాత **మిగతా 2లో...**

## తెలంగాణలో వర్షాలు పడకుండా క్షుద్రపూజలు

### - మాజీమంత్రి హరీష్ రావుపై పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ ఆరోపణలు

**హైదరాబాద్,ఆగస్టు 4 :** బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే,మాజీ మంత్రి హరీశ్ రావుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. హరీశ్ రావు క్షుద్ర పూజలు చేస్తున్నారంటూ తీవ్ర వ్యాఖ్య లు చేశారు. తెలంగాణలో వర్షాలు పడకూడదని, కరువు రావాలని కోరుకుంటూ ఆయన క్షుద్ర పూజలు చేశారని **మిగతా 2లో...**






## పోటెత్తుతున్న వరద..

**వేగంగా నిండుతున్న శ్రీశైలం డ్యామ్**

**ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణమ్మకు పోటెత్తుతున్న వరద**

**నాగార్జునసాగర్ ఇన్‌ఫ్లో 900 క్యూసెక్కులు**

## గుజరాత్‌లో చండీపుర వైరస్‌తో 22 మంది మృతి..

**15 ఏళ్లలోపు పిల్లలకు ఎక్కువ ప్రమాదం**

**జ్వరం తర్వాత మెదడుపై దాడి చేసే అవకాశం**

**టీకా, ప్రత్యేక మందు ప్రస్తుతం లేవు**

**లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలి**

**కీటకాల నుంచి రక్షణే ప్రధాన నివారణ**




## పెద్ద ఎత్తున కల్తీ మసాలాల తయారీ

25 టన్నుల కల్తీ మసాలా దినుసులు స్వాధీనం

13 మసాలా వ్యాపార సంస్థల్లో సోదాలు

కల్తీ మసాలాలతో క్యాన్సర్ వంటి ప్రమాదాలు

కల్తీలపై సిట్ ద్వారా దర్యాప్తు చేపడతాం

ఇప్పటికే ముగ్గురు నిందితుల అరెస్టు

నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ వెల్లడి



**హైదరాబాద్,ఆగస్టు 4 :**
ఆహార కల్తీకి పాల్పడుతున్న వారిపై ఉక్కుపాదం మోపుతున్న హెచ్-ఫాస్ట్ అధికారులు భారీ ఆపరేషన్ నిర్వహించి పెద్ద ఎత్తున మసాలా దినుసులు స్వాధీనం చేసుకున్నారు. నగరంలో పలు చోట్ల తనిఖీలు చేపట్టి 25 టన్నుల కల్తీ మసాలా దినుసులు స్వాధీనం చేసుకున్నట్టు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తెలిపారు. 13 మసాలా వ్యాపార సంస్థల్లో సోదాలు నిర్వహించి.. 25.3 టన్నుల కల్తీ మసాలా దినుసులు, 89.15 టన్నుల ముడిపదార్థాలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. **మిగతా 2లో...**

## జనన మరణాల నమోదుకు కొత్త రూల్స్..

### పార్లమెంట్‌లో బిల్లుకు ఆమోదం!

ఆలస్యంగా చేసే రిజిస్ట్రేషన్లకు కఠినమైన నిబంధనలు

రెండేళ్లు దాటితే జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు అవసరం

దేశంలో 99 శాతానికి పైగా పెరిగిన జనన, మరణాల నమోదు

గుర్తింపు మోసాలను అరికట్టడమే లక్ష్యమని తెలిపిన కేంద్రం



**న్యూఢిల్లీ,ఆగస్టు 4 :**
దేశంలో జనన మరణాల నమోదు ప్రక్రియను మరింత పటిష్ఠం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన కీలక బిల్లుకు పార్లమెంట్ ఆమోద ముద్ర వేసింది. జనన మరణాల నమోదు (సవరణ) బిల్లు-2026కు మంగళవారం రాజ్యసభ ఆమోదం తెలిపింది. **మిగతా 2లో...**

## ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ ద్వారా ఇంటర్నెట్

### ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశం

**హైదరాబాద్,ఆగస్టు 4 :**
తెలంగాణలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబర్ 1 నుంచి టీ-ఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని అధికారులను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో టీ-ఫైబర్ సేవల విస్తరణపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్ణీత గడువులోగా రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి టీ-÷బైర్ కనెక్టివిటీ కల్పించాలని స్పష్టం చేశారు. **మిగతా 2లో...**



## అగమ్య గోచరంగా ప్రభుత్వాసుపత్రులు

**ప్రత్యేక వైద్యసేవలు అందక ప్రజల ఇక్కట్లు**

**కమిషనర్ లేక గాలిలోదీపంలా వైద్యవిధాన పరిషత్**

**సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శలు**

**హైదరాబాద్,4 :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వాస్పత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు అవసరమైన గైనకాలజీ, ఆర్థోపెడిక్, యూరాలజీ, పీడియాట్రిక్ తదితర ప్రత్యేక వైద్య సేవలను అందించే తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిస్థితి కమిషనర్ లేక **మిగతా 2లో...**



# తెలంగాణలో వర్షాలు పడకుండా క్షుద్రపూజలు

**మొదటిపేజీ తరువాయి**

మహేశ్ గౌడ్ ఆరోపించారు. అందుకు తమ వద్ద ఆధారాలు కూడా ఉన్నాయని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. అరుంధతి సినిమా తరహాలో ఆయన పూజలు నిర్వహిస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. హరీశ్ రావు ఈ ఏడాది మార్చి 2న తమిళనాడులోని తిరుచ్చికి, జూన్ 1న కర్ణాటకలోని శివమొగ్గకు వెళ్లారని.. ఆ తేదీల్లో ఆయన ఎక్కడ ఉన్నారో ప్రజలకు వివరించాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. తిరుపతికి వెళ్లినప్పుడు మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు.. అఘోరీ ఆలయానికి వెళ్లిన విషయాన్ని ఎందుకు గోప్యంగా ఉంచారని టీపీసీసీ చీఫ్ ప్రశ్నించారు. ప్రజల సంక్షేమం కోసం దేవుడిని ప్రార్థించడం సహజమని.. కానీ మాజీ మంత్రి మాత్రం ప్రజలకు కీడు జరగాలని పూజలు చేశారని విమర్శించారు.

తన రాజకీయ స్వార్థం కోసమే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ ఆరోపణలపై నిజాలు బయటపెట్టినందుకే అద్దంకి దయాకర్, సామ రామ్మోహన్‌లకు లీగల్ నోటీసులు పంపించారని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. అయితే లీగల్ నోటీసులకు తాము భయపడబోమని స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా అఘోరాలతో క్షుద్ర పూజలు చేశారనే ప్రచారం గతంలో జరిగిందని టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ చెప్పారు. ఇప్పుడు హరీశ్ రావుపై వస్తున్న ఆరోపణలతో కేసీఆర్ పూజలు కూడా నిజమేనని అనిపిస్తోందన్నారు. యాదగిరిగుట్టకు వెళ్లి పొర్లు దండాలు పెట్టి మరీ ఏం చేశారో ప్రజలకు హరీశ్ రావు చెప్పాలని ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. గతంలో మంత్రాలు, తంత్రాల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన ఘటనలు ఉన్నాయని, దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ఇలాంటి ఆచారాలను బలంగా నమ్ముతారని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు.

# పారదర్శకంగా పోలీస్ ఉద్యోగ నియామకాలు



**మొదటిపేజీ తరువాయి**

అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. సమావేశంలో సీఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, డీజీపీ సీవీ ఆనంద్, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శిఖా గోయల్, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మెన్ వివి.శ్రీనివాస రావు, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు.

# పోటెత్తుతున్న వరద..


**హైదరాబాద్,ఆగస్టు 4 :**
ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో శ్రీశైలం జలాశయానికి కృష్ణా నది వరద ప్రవాహం పోటెత్తుతోంది. ఐదు రోజుల క్రితం ప్రవాహం ప్రారంభమైన సమయంలో 820 అడుగులుగా ఉన్న నీటిమట్టం, నిన్న సాయంత్రానికి 855.10 అడుగులకు చేరింది. ప్రస్తుతం డ్యామ్‌లో 92.048 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఈ సాయంత్రానికి ఈ నిల్వలు 100 టీఎంసీల మార్కును దాటుతాయని ప్రాజెక్టు అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీశైలం జలాశయం: జూరాల నుంచి సోమవారం 2.21 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, రాత్రి సమయానికి శ్రీశైలానికి 1.55 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. రోజుకు లక్ష క్యూసెక్కులకు పైగా వచ్చే ఈ వరద ఉధృతి మరో నాలుగైదు రోజులు కొనసాగవచ్చని శ్రీశైలం డ్యామ్ సీఈ కబీర్ బాషా తెలిపారు. ఎగువ కర్ణాటక ప్రాజెక్టులు: ఆలమట్టి డ్యామ్‌లోకి 1,25,855 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువకు 1.50 లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టులోకి 1,28,954 క్యూసెక్కులు వస్తుండగా, 1,40,880 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల ... తుంగభద్ర: నారాయణపూర్ నుంచి వస్తున్న నీటికి భీమా నది వరద జలాలు తోడవడంతో జూరాలకు ఏకంగా 1.92 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. వచ్చిన వరదను దృష్టిలో ఉంచుకొని జూరాల నుంచి 2,21,765 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. తుంగభద్ర డ్యామ్‌లోకి 57,785 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం 136 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఎగువ నుంచి 900 క్యూసెక్కులు వస్తున్నాయి. పులిచింతలలో 28.91 టీఎంసీల నీటినిల్వ ఉంది. ప్రకాశం బ్యారేజీలోకి 6,958 క్యూసెక్కులు చేరుతుండగా, 6,499 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు.

# ట్రంప్ తాజా సుంకాలు చట్టవిరుద్ధం

**మొదటిపేజీ తరువాయి**
ట్రంప్ ప్రభుత్వం కుటుంబాలు, వ్యాపారాలపై కొత్త టారిఫ్‌లతో భారం మోపాలని మరోసారి ప్రయత్నిస్తోంది' అని న్యూయార్క్ అటార్నీ జనరల్ లెతితియా జేమ్స్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం తన చర్యను ఏ విధంగా సమర్థించుకుంటున్నప్పటికీ తాను కోరుకున్న దేశాలపై అధిక సుంకాలు విధించేందుకు దేశాధ్యక్షుడికి అధికారం లేదని అమెరికా చట్టం, రాజ్యాంగం స్పష్టం చేస్తున్నాయని ఆయన అన్నారు. ట్రంప్ ప్రభుత్వ ప్రయత్నాలకు వ్యతిరేకంగా న్యాయస్థానంలో వ్యాజ్యం వేసిన రాష్ట్రాలలో న్యూయార్క్, కాలిఫోర్నియా, ఇల్లినాయిస్, మాసాచూసెట్స్, వాషింగ్టన్, విల్కాన్సిన్ సహా 18 రాష్ట్రాలు, కెంటుకీ, పెన్సిల్వేనియా గవర్నర్లు ఉన్నారు. విముక్తి దినోత్సవం సందర్భంగా ట్రంప్ ప్రభుత్వం విధించిన సుంకాలను రాజ్యాంగ విరుద్ధమైనవిగా న్యాయస్థానం గతంలో తీర్పు ఇవ్వడంతో 1974వ సంవత్సరపు వాణిజ్య చట్టంలోని సెక్షన్ 301 కింద కొత్తగా ముందుకు తెచ్చిన టారిఫ్‌లు గత నెల నుంచే అమలులోకి వచ్చాయి. ఈ కొత్త సుంకాల కారణంగా ప్రధాన వాణిజ్య భాగస్వాములైన కెనడా, జపాన్, నార్వే, తైవాన్, చైనాలపై బాగా ప్రభావం పడుతుంది. కాగా ట్రంప్ తన కార్యనిర్వాహక అధికారాన్ని అతిక్రమించారంటూ రెండు చిన్న వ్యాపార సంస్థల తరఫున లిబర్టీ జస్టిస్ సెంటర్ కూడా విడిగా వ్యాజ్యాన్ని వేసింది. బలవంతంగా పనులు చేయిస్తున్నారన్న పేరుతో ప్రభుత్వం సుంకాలను భారీగా పెంచిందని, ఇది వినియోగదారులపై అధిక ఆర్థిక భారాన్ని మోపిందని న్యూయార్క్ గవర్నర్ కాథీ హోచల్ విమర్శించారు.

# గుజరాత్‌లో చండీపుర వైరస్‌తో 22 మంది మృతి..

**గుజరాత్,ఆగస్టు 4 :**
గుజరాత్‌లో చండీపుర వైరస్ మరోసారి కలకలం రేపుతోంది. ఈ వైరస్ కారణంగా ఇప్పటివరకు 22 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. మరో 35 మందికి వైరస్ సోకినట్లు నిర్ధారణ అయింది. సాధారణ జ్వరంలా మొదలయ్యే ఈ ఇన్‌ఫెక్షన్ కొన్ని గంటల్లోనే మెదడుపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉండటంతో వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. అసలు చండీపుర వైరస్ అంటే ఏంటి? ఇది ఎలా వ్యాపిస్తుంది? లక్షణాలు ఏంటి? చికిత్స ఉందా? తెలుసుకుందాం..



**ఏంటీ వైరస్?**
రాబ్డోవిరిడే కుటుంబానికి చెందినదే ఈ చండీపుర వైరస్ (సీహెచ్‌పీవీ). దీన్ని తొలిసారి 1965లో భారత్‌లో గుర్తించారు. వర్షాకాలంలో ఎక్కువగా కనిపించే శాండ్‌ఫ్లై (ఇసుక ఈగ) వల్ల ఇది వ్యాపిస్తుంది. మనుషుల నుంచి మనుషులకు ఈ వైరస్ సోకినట్లు ఇప్పటివరకు ఆధారాలు లేవు.

**ఎవరికి ఎక్కువ ప్రమాదం?**
ఈ వైరస్ ఎక్కువగా 15 ఏళ్లలోపు చిన్నారులపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, శాండ్‌ఫ్లైలు ఎక్కువగా ఉండే చోట్ల ప్రమాదం అధికంగా ఉంటుంది. వర్షాకాలంలో ఈగల సంఖ్య పెరగడంతో వైరస్ వ్యాప్తి కూడా ఎక్కువగా కనిపిస్తుంది.

**మొదట కనిపించే లక్షణాలు ఏవి?**
ప్రారంభంలో ఈ వైరస్‌ను గుర్తించడం కాస్త కష్టం. ఎందుకంటే మొదట సాధారణ వైరల్ జ్వరంలాగే కనిపిస్తుంది. జ్వరం, తలనొప్పి, వాంతులు, విరేచనాలు, నీరసం, ఫ్లూ లక్షణాలు ఉంటాయి. ఈ దశలో చాలామంది సాధారణ జ్వరంగా భావించే అవకాశం ఉంటుంది.

**ఎందుకు ప్రమాదకరం?**
కొంతమంది చిన్నారుల్లో వైరస్ చాలా వేగంగా మెదడుపై దాడి చేస్తుంది. దీంతో మెదడు వాపు (ఎన్‌సెఫలైటిస్) వస్తుంది. ఆ తర్వాత పరిస్థితి గంటల వ్యవధిలోనే విషమించవచ్చు.

**తీవ్రమైన లక్షణాలు ఇవీ..**
మూర్ఛ, స్పృహ కోల్పోవడం, కోమాలోకి వెళ్లడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందుల వంటి తీవ్రమైన లక్షణాలు కనిపిస్తాయి. కొన్ని కేసుల్లో ఆసుపత్రిలో చేరిన 48 నుంచి 72 గంటల్లోనే ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

**చికిత్స ఉందా?**
ప్రస్తుతం చండీపుర వైరస్‌కు ప్రత్యేకంగా పనిచేసే మందు లేదు. టీకా కూడా అందుబాటులో లేదు. రోగికి కనిపించే లక్షణాలను బట్టి చికిత్స అందిస్తారు. శ్వాస, రక్తపోటు వంటి కీలక అవయవాల పనితీరును నిలకడగా ఉంచే ప్రయత్నం చేస్తారు. అందుకే లక్షణాలు కనిపించగానే ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి తీసుకెళ్లడం కీలకం.

**ఎలా జాగ్రత్త పడాలి?**
చండీపుర వైరస్‌కు ప్రత్యేక టీకా లేకపోవడంతో నివారణే ఉత్తమ మార్గం. శాండ్‌ఫ్లై కాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలకు పూర్తి చేతులు కవర్ అయ్యేలా దుస్తులు వేయాలి. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కీటకనాశక ద్రావణాలు, దోమతెరలు ఉపయోగించాలి. జ్వరం, వాంతులు, మూర్ఛలు కనిపిస్తే వెంటనే వైద్యుణ్ని సంప్రదించాలి.

**ఎందుకు అప్రమత్తంగా ఉండాలి?**
చండీపుర వైరస్ చాలా అరుదుగా కనిపించినా, ఒకసారి సోకితే వేగంగా తీవ్ర స్థితికి చేరుకునే ప్రమాదం ఉంది. అందుకే పిల్లల్లో సాధారణ జ్వరంతో పాటు నాడీ సంబంధిత లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య పరీక్షలు చేయించాలని నిపుణులు సూచిస్తున్నారు.

# తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



**మొదటిపేజీ తరువాయి**
పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.
తీరప్రాంతాల్లోని దాదాపు 33 లక్షల మంది ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు పవన్ వివరించారు. నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అధికారులకు స్పష్టం చేశారు. నిర్దేశిత వ్యవధిలోనే కీలక నిర్మాణాలను పూర్తి చేసి, ప్రాజెక్టును సాధ్యమైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. తీరప్రాంత ప్రజల తాగునీటి భద్రతను నిర్ధారించడంలో జల్ జీవన్ మిషన్ కీలక పాత్ర పోషిస్తోందని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం కొనియాడారు.

# జనన మరణాల నమోదుకు కొత్త రూల్స్..

**మొదటిపేజీ తరువాయి**
లోక్‌సభలో ఇదివరకే ఆమోదం పొందిన ఈ బిల్లు, త్వరలోనే చట్టరూపం దాల్చనుంది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. తాజా సవరణల ప్రకారం, జనన లేదా మరణ ధ్రువీకరణ పత్రాలను ఆలస్యంగా నమోదు చేయాలంటే కఠిన నిబంధనలు వర్తిస్తాయి. ఘటన (పుట్టిన లేదా మరణించిన) జరిగిన ఏడాది తర్వాత (రెండేళ్ల లోపు) నమోదు చేయాల్సి వస్తే జిల్లా మేజిస్ట్రేట్ లేదా సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్ నుంచి ముందస్తు అనుమతి పొందడం తప్పనిసరి. ఒకవేళ రెండేళ్లు దాటిన పక్షంలో, ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు ఉంటేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఈ సందర్భంగా మంత్రి నిత్యానంద రాయ్ మాట్లాడుతూ, జనన మరణాలను నిర్ణీత సమయంలోగా నమోదు చేయడాన్ని ప్రోత్సహించడంతో పాటు, తప్పుడు సమాచారం, అవకతవకలను అరికట్టడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 3.5 లక్షల రిజిస్ట్రేషన్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయని, 2014లో 86.6 శాతంగా ఉన్న జననాల నమోదు 2024 నాటికి 99 శాతానికి పైగా చేరిందని ఆయన వివరించారు. అదేవిధంగా మరణాల నమోదు 72.5 శాతం నుంచి 99.4 శాతానికి పెరిగిందని మంత్రి వెల్లడించారు. బిల్లుపై జరిగిన చర్చలో భాగంగా బీజేపీ ఎంపీ దర్శన సింగ్ మాట్లాడుతూ, ఈ కొత్త సవరణలు వ్యవస్థను మరింత సరళంగా, పారదర్శకంగా మారుస్తాయని కొనియాడారు. అయితే, రెండేళ్ల తర్వాత జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌ను ఆశ్రయించాలనే నిబంధనపై బీజేడీ ఎంపీ డాక్టర్ సంతృప్త్ మిశ్రా కొంత ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఇప్పటికే పనిభారంతో ఉన్న న్యాయస్థానాలపై మరింత ఒత్తిడి పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. వైసీపీ, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, బీఆర్ఎస్, అన్నాడీఎంకే సహా పలు పార్టీల సభ్యులు ఈ బిల్లుకు మద్దతు తెలిపారు.

# పెద్ద ఎత్తున కల్తీ మసాలాల తయారీ

**మొదటిపేజీ తరువాయి**
3 క్రిమినల్ కేసుల్లో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు చెప్పారు. సింథటిక్ రంగులు, క్లాత్ డైలు, టాల్కమ్ పౌడర్లు, ఇండస్ట్రియల్ కలర్స్, రైస్ బ్రాన్ అయిల్ నకిలీ మసాలాల్లో వినియోగించినట్టు గుర్తించామన్నారు. కల్తీ మసాలాల వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు. కల్తీ ఆహార పదార్థాల కేసులపై త్వరలో ప్రత్యేక సిట్ ఏర్పాటు చేస్తామని సజ్జనార్ తెలిపారు. ఈ మేరకు
హైదరాబాద్ కల్తీ మసాలా తయారీముఠా కేసులో హైదరాబాద్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసులో సిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ ప్రకటించారు. ప్రమాదకర రసాయనాలతో టన్నుల మసాలా దినుసులను తెలుగు రాష్ట్రాలకు ఈ ముఠా సరఫరా చేస్తోందని తెలిపారు. సిట్ ఏర్పాటు చేసి సమగ్ర దర్యాప్తు చేస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో కల్తీ మసాలాల తయారీ కేంద్రాలపై హెచ్ -ఫాస్ట్ మెరుపు దాడులు చేసిందని సీపీ పేర్కొన్నారు. 13 మసాలా వ్యాపార సంస్థల్లో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ప్రజల సమాచారం ఆధారంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని చెప్పుకొచ్చారు. 25 టన్నులకుపైగా కల్తీ మసాలాలు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. కల్తీ మసాలాల కేసుల్లో ముగ్గురిని అరెస్ట్ చేశామని అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి, బాలాపూర్ పోలీస్ స్టేషన్లలో మూడు కేసులు నమోదు అయ్యాయని వెల్లడించారు. వాము, జీలకర్ర, లవంగం, షాజీరా, ఆవాలు సహా పలు మసాలాల్లో కల్తీ చేసినట్లు గుర్తించామని తెలిపారు. ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ కలర్స్‌తో మసాలాలు తయారీ చేస్తున్నారని సీపీ సజ్జనార్ తెలిపారు. టాల్కమ్ పౌడర్, ఇండస్ట్రియల్ డైలు, రైస్ బ్రాన్ ఆయిల్ వినియోగిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. మసాలాలకు మెరుపు కోసం హానికర రసాయనాలను వినియోగిస్తున్నారని తెలిపారు. రంగులు వేసి నాణ్యమైన మసాలాల మాదిరిగా విక్రయిస్తున్నారని చెప్పుకొచ్చారు. 89 టన్నులకుపైగా ముడి పదార్థాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కల్తీ మసాలాల నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపామని వెల్లడించారు. కల్తీ ఆహారం వల్ల కాలేయం, మూత్రపిండాలకు ముప్పు పొంచి ఉందని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. ఈ మసాలాలతో క్యాన్సర్, అలర్జీలు, జీర్ణ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ-ఈం÷ ఏర్పడిన 140 రోజుల్లో 659 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించామని అన్నారు. 202 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసి, 246 టన్నుల కల్తీ ఆహారాన్ని స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ప్రజలు
అనుమానాస్పద ఆహారంపై వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ ద్వారా ఇంటర్నెట్

**మొదటిపేజీ తరువాయి**
సెప్టెంబర్ 1 తర్వాత ఏ ప్రభుత్వ శాఖ కూడా ప్రైవేట్ ఇంటర్నెట్ సేవలను వినియోగిస్తూ బిల్లులు చెల్లించవద్దని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ నిధుల ఆదాతో పాటు ఏకీకృత డిజిటల్ నెట్‌వర్క్ ఏర్పాటు లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ విభాగాలు వినియోగిస్తున్న టీ-స్వాన్ నెట్‌వర్క్‌ను వచ్చే నెల రోజుల్లో పూర్తిగా టీ-÷బైర్‌కు బదిలీ చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన గడువు విధించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపుదిద్దుకుంటున్న ఫ్యూచర్ సిటీకి అత్యాధునిక టీ-÷బైర్ కనెక్టివిటీ కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని శ్రీధర్ బాబు ఆదేశించారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ఇంటింటికీ ఇంటర్నెట్' కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి గ్రామీణ ప్రాంతాల వరకు నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసి తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ కనెక్టివిటీ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నారు. ఇందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు.

# అగమ్య గోచరంగా ప్రభుత్వాసుపత్రులు

**మొదటిపేజీ తరువాయి**
గాలిలో దీపంలా మారడం శోచనీయమని తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా హరీశ్‌రావు పోస్టుపెట్టారు. గత రెండు నెలలుగా పూర్తిస్థాయి అధికారి లేకపోవడంతో ÷ఎఖ పరిధిలోని ఎంసీహెచ్, జిల్లా ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులు, సీహెచ్సీ మొత్తంగా 184 ఆస్పత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆస్పత్రుల పనితీరు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, వైద్యుల హాజరు, ల్యాబ్ పరీక్షలు, మందుల లభ్యత తదితర అంశాలను పర్యవేక్షించే అధికార యంత్రాంగమే లేకుండా పోయిందని హరీశ్‌రావు చెప్పుకొచ్చారు. దీంతో ఒకవైపు వైద్యులు, వైద్య సిబ్బంది సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరోవైపు కాంగ్రెస్ పాలనలో ప్రజలు సరైన వైద్య సేవలు అందక అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది వేతనాలు, సర్వీస్ సమస్యలు సహా ఇతర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ÷ఎఖని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా మార్చి ప్రభుత్వంలో విలీనం చేయాలని తమ హయాంలో నిర్ణయించామని ప్రస్తావించారు. దాదాపు మూడేళ్లు గడుస్తున్నా సర్వీసు నిబంధనలు రూపొందించక పోవడం, లక్ష్యం కార్యరూపం దాల్చకపోవడం దురదృష్టకరమని హరీశ్‌రావు అన్నారు. దీంతో వైద్యులు, వైద్య సిబ్బంది తీవ్ర నిరాశకు గురవుతున్నారని చెప్పుకొచ్చారు. ఇదే విషయమై ఉద్యోగులు ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా లాభం లేకుండా పోతుందని తెలిపారు. రో÷-లడెక్కి నిరసనలు తెలియచేస్తున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమస్యలతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడాలని డిమాండ్ చేశారు. వెంటనే డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కు సంబంధించి వెంటనే కమిటీ వేసి సర్వీస్ నిబంధనలు, మార్గదర్శకాలు రూపొందించాలని, తక్షణమే పూర్తిస్థాయి అధికారిని నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# అడవిలో ఆదివాసీ మహిళ వద్ద పుట్టగొడుగులు కొనుగోలు చేసిన మంత్రి సీతక్క

- కాన్వాయ్ ఆపి పుట్టగొడుగులు కొనుగోలు
- అటవీ ఉత్పత్తులకు ప్రోత్సాహం





ములుగు జిల్లా, ప్రతినిధి ఆగస్టు 04 (పీపుల్స్ న్యూస్)

ములుగు జిల్లాలో పర్యటనలో భాగంగా మేడారం పర్యటన ముగించుకుని ఏటూరునాగారం వైపు వెళ్తున్న రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క మార్గమధ్యలో ఆదివాసీ మహిళ పుట్టగొడుగులు విక్రయిస్తుండటాన్ని గమనించి తన కాన్వాయ్‌ను ఆపారు. అనంతరం ఆమె వద్ద పుట్టగొడుగులను స్వయంగా కొనుగోలు చేసి ఆదివాసీ మహిళను ప్రోత్సహించారు. అడవిలో సేకరించిన పుట్టగొడుగులను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న ఆదివాసీ మహిళతో మంత్రి సీతక్క కొద్దిసేపు ఆప్యాయంగా మాట్లాడారు. పుట్టగొడుగుల విక్రయాల గురించి, వాటి ద్వారా లభిస్తున్న ఆదాయం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పుట్టగొడుగులను కొనుగోలు చేసి ఆమెకు అండగా నిలిచారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ పుట్టగొడుగులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. కరోనా సమయంలో తాను కూడా పుట్టగొడుగులు తిన్నానని గుర్తుచేసు కున్నారు. సహజసిద్ధంగా లభించే అటవీ ఉత్పత్తులను సేకరించి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న ఆదివాసీ మహిళలకు ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాప్రతినిధి గా ఉన్నత పదవిలో ఉన్నప్పటికీ మార్గమధ్యంలో సాధారణ ప్రజలతో మమేకమై వారి జీవన పరిస్థితులను తెలుసుకుంటూ, స్థానిక ఉత్పత్తులను స్వయంగా కొనుగోలు చేయడం ద్వారా మంత్రి సీతక్క మరోసారి తన సరళతను చాటుకున్నారు. మంత్రి పుట్టగొడుగులు కొనుగోలు చేయడంతో ఆదివాసీ మహిళ



ఆనందం వ్యక్తం చేశారు.

# ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే పిటిఆర్టియు లక్ష్యం.

- పిఆర్టియు జిల్లా అధ్యక్షులు రేగూరి సుబాకర్ రెడ్డి





రేగొండ,ఆగస్టు4( పీపుల్స్ న్యూస్)

ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కార లక్ష్యంతో పని చేసే సంఘం పిఆర్టియు అని పిఆర్టియు జిల్లా అధ్యక్షులు రేగూరి సుబాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం రేగొండ,గోరికొత్తపల్లి మండలాల్లో ప్రారంభమైన పి ఆర్ టి యు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రేగొండ మండలం లో ముందుగా జెడ్ పి హెచ్ ఎస్ మడతపల్లి, గోరి కొత్తపల్లి మండల కేంద్రంలోని జెడ్ పి ఎస్ హెచ్ పాఠశాలలో పి ఆర్ టి యు సభ్యత్వ నమోదు కార్యక్రమం లాంఛనంగా పిఆర్ టి యు నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు రేగురి సుబాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించే ఏకైక సంఘం పిఆర్టియు అని, పిఆర్టియు లో సభ్యత్వం తీసుకొని సంఘాన్ని మరింత బలపరచాలని కోరారు. ప్రస్తుతం ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలైన పెండింగ్ డి ఏ లు, నూతన పిఆర్సి అమలు, సిపిఎస్ రద్దు, వీటి పైన ఈ ఆగస్టు లోగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోతే, సెప్టెంబర్ 1 నుంచి పి ఆర్ సి అమలు చేసేంతవరకు.. నిరవధికంగా ధర్నా కార్యక్రమంలోకి పి ఆర్ టి యు దిగుతుందని, ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రేగొండ మండల పిఆర్టియు అధ్యక్షులు దుస్స సదాకర్ మాట్లాడుతూ... మండల స్థాయిలో ఉపాధ్యాయ వర్గానికి ఎలాంటి సమస్యలున్న తమ దృష్టికి తీసుకు వస్తే... వాటిని తప్పకుండా పరిష్కరించే ప్రయత్నం చేస్తామని,ఆగస్టు 31 లోగా పిఆర్సి అమలు చేయకపోతే సెప్టెంబర్ 1 నుంచి పిఆర్సి అమలు అయ్యే వరకు నిరవధిక సమ్మెలో పాల్గొనడానికి అందరు సిద్ధంగా ఉండాలని ఉపాధ్యాయులను ఆయన కోరారు, అనంతరం యుపిఎస్ లింగాల ,పిఎస్ రంగయ్యపల్లి, జెడ్ పి ఎస్ ఎస్ రంగయ్యపల్లి ,జెడ్ పి హెచ్ ఎస్ రేపాక , పిఎస్ రేపాక, జెడ్ పి హెచ్ ఎస్ తిరుమలగిరి, జెడ్ పి హెచ్ ఎస్ జగ్గయ్యపేట, జడ్పిహెచ్ఎస్ గోరి కొత్తపల్లి పాఠశాలలో ఈరోజు పిఆర్టియు సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ,జిల్లా, మండల బాధ్యులైన ..పో తర్ల సతీష్, గట్ల శివప్రసాద్, ఎండి రంజాన్, శ్యామ్, మధుసూదన్ రెడ్డి, గిరిధర కృష్ణ, సాంబ రెడ్డి, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

# బిడ్డకు తల్లిపాలే ఆరోగ్యానికి శ్రీరామరక్ష.

- తల్లిపాల వారోత్సవాల్లో
- ఐసీడీఎస్ సూపర్వైజర్ సరోజ







రేగొండ,ఆగస్టు4(పీపుల్స్ న్యూస్)

పుట్టిన బిడ్డకు తల్లిపాలు తాగించడం పిల్లల ఆరోగ్యానికి శ్రీరామరక్షగా దోహదపడతాయని ఐ సి డి ఎస్ సూపర్వైజర్ అరుణ పేర్కొన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం రేగొండ మండల కేంద్రంలోని 1,4, గడిపల్లె అంగన్వాడి కేంద్రంలో టీచర్లు మాడగాని సుజాత, నామాల రజిత, ఎడెల్లి సునీత ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుణ, స్థానిక సర్పంచి వారణాసి మౌనిక పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తల్లిపాలు బిడ్డల ఆరోగ్య పెరుగుదలకు దోహదపడతాయని ఐసీడీఎస్ సూపర్వైజర్ సరోజ అన్నారు. తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో తల్లిపాలు ఎంతో కీలకమని వివరించారు. బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే తప్పనిసరిగా ముర్రు పాలు పట్టాలని పిల్లల తల్లులకు బాలింతలకు సూచించారు. తల్లిపాలు బిడ్డను అనేక రకాల వ్యాధుల నుండి కాపాడుతాయని, ముర్రు పాలు పిల్లల జీర్ణశయాన్నీ శుభ్రపరుస్తాయని తెలిపారు. అనంతరం పిల్లలకు అన్నప్రాసన అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ రజిత,సర్పంచ్ మౌనిక, రేగొండ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం జెడి నాయుడు,వార్డు సభ్యులు జి తిరుపతమ్మ, ఏ ఎన్ ఎం యాదలక్ష్మి, ఆయా శ్రీలత, ఆశ కార్యకర్తలు దోపతి ఇందిర, సుభద్ర, హసీనా,ం ‸జిత,స్వప్న,మహిళ సంఘం అధ్యక్షురాలు సుమలత, రజిత,వార్డు సభ్యురాలు తడుక ప్రవళిక, తదితరులు పాల్గొన్నారు.

# తాడి చెట్టు పై నుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు..


రేగొండ,ఆగస్టు4 (పీపుల్స్ న్యూస్) జీవనోపాధి కోసం తాడి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా కాలు జారి కింద పడి గీత కార్మికుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలం కొడవటంచ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మూల చంద్ర మౌళి వృత్తిరీత్యా తాడి చెట్లు ఎక్కి కల్లు గీస్తూ జీవనం సాగిస్తున్నాడు. వృత్తిలో భాగంగా చంద్రమౌళి యథావిధిగా చెట్టు ఎక్కిన అతను కల్లు దించుతుండగా ప్రమాదవశత్తు కాలుజారి కింద పడ్డాడు. స్థానికులు వెంటనే గమనించి 108 అంబులెన్స్ ద్వారా అతన్ని హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ చికిత్స పొందుతున్నాడు. నిరుపేద అయిన చంద్రమౌళి కి ప్రభుత్వం సహాయమందించి వైద్య చికిత్సలు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



# కోటంచ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే గండ్ర.

- శ్రావణ మాస ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ





రేగొండ,ఆగస్టు4(పీపుల్స్ న్యూస్)

భూపాలపల్లి నియోజకవర్గం రేగొండ మండలం కొడవటంలో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని మంగళవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే గండ్రకు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రావణమాస ఉత్సవాల సందర్భంగా దేవాలయంలో ఆగస్టు 13 నుండి సెప్టెంబర్ 11 వరకు వరకు నెల రోజులపాటు ప్రతిరోజు ఉదయం 8.00 గంటల నుండి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే గండ్ర ఆలయ చైర్మన్ నాయినేని సంపత్ రావు, ఈవో బిల్లా శ్రీనివాస్, ఎస్సైసుధాకర్, తదితర కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ, శ్రావణమాస ఉత్సవాలలో నియోజకవర్గ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నాయినేని సంపత్‌రావు, ఈవో శ్రీనివాస్, ఎస్సై సుధాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇప్పకాయల నరసయ్య, పున్నం రవి, టౌన్ అధ్యక్షులు ఏనుగు రవీందర్ రెడ్డి, మాజీ ఆలయ చైర్మన్ ముల్కనూరి బిక్షపతి, మాజీ సర్పంచ్ పబ్బ శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# బాలానగర్‌లో విద్యుదాఘాతంతో గుర్తుతెలియని యువకుడి మృతి

బాలానగర్ ఆగస్టు 05 ( పీపుల్స్ న్యూస్)

సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని బాలానగర్ టీ-జంక్షన్ వద్ద సోమవారం అర్ధరాత్రి విషాదకర ఘటన చోటుచేసుకుంది. బాలానగర్ సీఐ తెలిపిన వివరాల ప్రకారం విద్యుదాఘాతానికి గురై సుమారు 30 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న బాలానగర్ పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.



ఘటనపై విచారణ చేపట్టిన విద్యుత్ శాఖ అధికారులు, బాలానగర్ టీ-జంక్షన్‌లోని శ్రీ మల్లికార్జున చెరకు రసం దుకాణం వద్ద విద్యుత్ షాక్‌కు గురికావడం వల్లే యువకుడు మృతి చెందినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రస్తుతం మృతుడి గుర్తింపు కోసం పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు లేదా అతడిని గుర్తించ గలిగిన వారు వెంటనే బాలానగర్ పోలీసులను సంప్రదిం చాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపగా, విద్యుత్ భద్రతా ప్రమాణాలపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు

## ఇందిరమ్మ ఇండ్లను వేగవంతంగా పూర్తి చేయాలి . అదనపు కలెక్టర్ భాస్కరరావు,



**తుర్కపల్లి , ఆగస్టు 4** ఇందిరమ్మ ఇండ్లను వేగవంతంగా పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు హౌసింగ్ డిపార్ట్మెంట్ చీఫ్ ఇంజనీర్ చైతన్యకుమార్ లు అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ఇంటింటికి తిరిగి పరిశీలించారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మాణాలను మై వన్ టెక్నాలజీ ద్వారా నిర్మాణం చేపట్టిన ఇండ్లను నాణ్యత పరిశీలించారు. ఇందిరమ్మ ఇల్లు వేగవంతం త్వరగా పూర్తి చేయాలని,ఉన్నత పాఠశాల తరగతి ల నిర్మాణం ను పరిశీలించారు.ఆర్థిక భారం ఉన్న లబ్ధిదారులకు వివిధ ఏజెన్సీ సాయి మణికంఠ ఇన్ఫ్రా, ఆస్ట్రానిక్ కన్స్ట్రక్షన్, స్కై పాత్ ఇన్ఫ్రా ఏజెన్సీ ల ద్వారా నిర్మాణాలు పనులు వేగవంతం చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇల్లు షేర్ వాల్ టెక్నాలజీ నాణ్యత పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల పిడి అలివేలు, ఎంపీడీవో గీతారెడ్డి, డి ఈ హౌసింగ్ శ్రీరాములు,హౌసింగ్ ఏఈ నరేష్, గ్రామ సర్పంచ్ దొమ్మాట అనురాధ బాబు, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇంజ నరేష్ ఉపసర్పంచ్ జేరిపోతుల బాల నర్సయ్య, కారోబార్ దుడుక బాబు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు



**వలిగొండ ఆగస్టు 4**
మండల పరిధిలోని చిత్తాపురం గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను అంగన్వాడీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వల్లమల మానస మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టిన వెంటనే ఇచ్చే ముర్రుపాలు అమృతంతో సమానమని అన్నారు. ఇవి శిశువుకు రోగనిరోధక శక్తిని అందిస్తాయని తెలిపారు. మొదటి ఆరు నెలల వరకు పసిబిడ్డకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, కనీసం రెండేళ్ల వరకు తల్లిపాలు పట్టించడం వల్ల పిల్లలు శారీరకంగా,మానసికంగా ఆరోగ్యంగా ఎదుగుతారని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పసల విజయానంద్ ,పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ అంగన్వాడీ టీచర్ గుంటోజు మంజుల , మనెమ్మ , తల్లులు,గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

## వరుస బాధ్యతలతో గుర్తింపు పొందిన స్వప్న రాజు గౌడ్కు ఘన సన్మానం...!

**- పలు కీలక పదవులకు ఎన్నికైన సందర్భంగా ఐకేపీ అధికారుల అభినందనలు...!!**



**జనగామ/బచ్చన్నపేట, ఆగస్టు 4** జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన పచ్చిమట్ల స్వప్న రాజు గౌడ్ వరుసగా పలు కీలక బాధ్యతలకు ఎన్నికై గుర్తింపు పొందారు. బచ్చన్నపేట మండల సమైక్య అధ్యక్షురాలిగా, జనగామ--యాదాద్రి భువనగిరి జిల్లాల శ్రీనిధి డైరెక్టర్గా, రాష్ట్ర శ్రీనిధి ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన సందర్భంగా ఐకేపీ అధికారులు, వివోఏలు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... మహిళా సాధికారతకు స్వప్న రాజు గౌడ్ సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయని, ఆమె మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి సమాజ సేవలో విశేష కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఏపీఎం రవి, సీసీలు నరసింహులు, యాదగిరి, విజయలక్ష్మి, రఘు, వివిధ గ్రామాల వివోఏలు, ఐకేపీ సిబ్బంది పాల్గొని స్వప్న రాజు గౌడ్కు శుభాకాంక్షలు తెలిపారు.

## చందానగర్లో విషాదం.. లిఫ్ట్లో ఇరుక్కుని మహిళ మృతి

**కొండాపూర్ :** లిఫ్ట్ ( ) లో ఇరుక్కుని మహిళ ( మృతి చెందిన ఘటన చందానగర్() పోలీసు స్టేషన్ పరిధిలో చోటు . మృతురాలి భర్త, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగండ్ల ఎస్సీ కాలనీలో నివాసం ఉండే ధాడి శ్రీనివాస్, తన భార్య అనసూయ(43) తో కలిసి మంగళవారం చందానగర్ అన్నపూర్ణ ఎన్క్లేవ్లోని చాట్వాజ్ మెన్షన్ అపార్ట్మెంట్లో ఉంటున్న మేనమామ ధాడి గోవింద్ను పరామర్శించేందుకు వచ్చారు.అపార్ట్మెంట్ గ్రౌండ్ ఫ్లోర్లో లిఫ్ట్ వద్దకు చేరుకున్న అనంతరం శ్రీనివాస్ ముందుగా లిఫ్ట్లోకి ప్రవేశించగా, అనసూయ లిఫ్ట్లోకి ఎక్కుతున్న సమయంలో ఒక కాలు లోపల, మరో కాలు బయట ఉండగానే లిఫ్ట్ తలుపులు పూర్తిగా మూసుకోకముందే అకస్మాత్తుగా పైకి కదిలింది. దీంతో ఆమె లిఫ్ట్, ప్రవేశ ద్వారం మధ్య ఇరుక్కుపోయి తీవ్ర గాయాలపాలై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. భర్త శ్రీనివాస్ కేకలు వేయడంతో అపార్ట్మెంట్ వాసులు, స్థానికులు అక్కడికి చేరుకుని లిఫ్ట్ను నిలిపేసి అనసూయను బయటకు తీశారు.

# మేడారం చివరిదశ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి.

- స్వయం ఉపాధితో మహిళల ఆర్థిక అభివృద్ధి.
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి,
- గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క.



**ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 04( పీపుల్స్ న్యూస్)**
మేడారం సమ్మక్క సారలమ్మ ఆలయ చివరిదశ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు. మహిళలు స్వయం ఉపాధితోనే ఆర్థిక అభివృద్ధి సాధించాలని మహిళలు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఎస్ ఎస్ తాడ్వాయి మండలం మేడారం ఆలయ పరిసర ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా,







మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క మంగళవారం పరిశీలించారు. అనంతరం వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం సమ్మక్క భవన్లో మదర్ ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళల ఉచిత టైలరింగ్ శిక్షణ శిబిర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు ఉచిత కుట్టుమిషన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఆలయ పరిసరాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు చివరి దశకు చేరుకున్నాయని, నిర్మాణ పనులను వేగంగా సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. కుట్టు శిక్షణతో పాటు కుట్టుమిషన్ల పంపిణీ మహిళలకు ఉపాధి కల్పించడంతో పాటు వారి కుటుంబాల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. మహిళల స్వావలంబన, సాధికారత కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ భగవాన్రెడ్డి, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, ప్రత్యేక అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





# దిల్కుష్ నగర్లో ఘనంగా లేఔట్ సైన్ బోర్డుల ప్రారంభోత్సవం

- తక్కువ నీటి ఒత్తిడి సమస్యపై వెంటనే అధికారులకు ఆదేశాలు
- కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**బాలానగర్ ఆగస్టు 05 ( పీపుల్స్ న్యూస్)**
సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని దిల్కుష్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లేఔట్ సైన్ బోర్డుల ప్రారంభోత్సవ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై, స్థానిక బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డితో కలిసి సైన్ బోర్డులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ, దిల్కుష్ నగర్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న దిల్కుష్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఒక కాలనీ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ప్రజల సహకారం, స్థానిక సంక్షేమ సంఘాల చొరవ, ప్రజాప్రతినిధులు మరియు అధికారుల సమన్వయం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. కాలనీ సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న సంక్షేమ సంఘాల సేవలు ఆదర్శప్రాయమని




కొనియాడారు. అనంతరం కాలనీ వాసులు తమ ప్రాంతంలో తాగునీటి సరఫరాలో వాటర్ ప్రెషర్ తక్కువగా ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సంబంధిత అధికారులతో మాట్లాడి, నీటి ఒత్తిడిని పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి అధికారులకు సూచనలు ఇవ్వడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మందడి సుధాకర్ రెడ్డి, బాలానగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఖాజా, దిల్కుష్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్ ముజీబ్, ప్రధాన కార్యదర్శి ఖాదర్ హుస్సేన్, అసోసియేషన్ సభ్యులు మొహమ్మద్ జమీల్, మొహమ్మద్ కరీముల్లా, మొహమ్మద్ ఫారూఖ్, ఆంజనేయులు గౌడ్, మొహమ్మద్ తౌఫిఖ్, మొహమ్మద్ అజీమ్, ముఖ్తార్, రాజ్ కుమార్, మొహమ్మద్ ఫయాజ్, అజమాత్, హది, మొహమ్మద్ జాబేర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కాలనీవాసులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. దిల్కుష్ నగర్లో ఏర్పాటు చేసిన ఈ కొత్త లేఔట్ సైన్ బోర్డులు కాలనీకి ప్రత్యేక గుర్తింపును తీసుకురావడంతో పాటు సందర్శకులకు మార్గదర్శకంగా ఉపయోగపడనున్నాయని స్థానికులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమం అనంతరం అసోసియేషన్ సభ్యులు ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలుపుతూ, కాలనీ అభివృద్ధికి భవిష్యత్తులో కూడా ఇదే విధమైన సహకారం కొనసాగించాలని కోరారు.

# ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి .

- పోటీ ప్రపంచంతో పోటీపడాలి.
- పరీక్ష ఫలితాలలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవాలి.
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క







**ములుగు జిల్లా ప్రతినిధి 04 (పీపుల్స్ న్యూస్)**
విద్యార్థినీ విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, పోటీ ప్రపంచంలో పోటీ పడాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. మంగళవారం వెంకటాపూర్ మండలం జవహర్ నగర్ గ్రామంలో సమగ్ర శిక్షణ ఆధ్వర్యంలో 2 కోట్ల 30 లక్షల రూపాయలతో నిర్మించిన నూతన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నూతన భవనం, అదనపు తరగతి గదులు, ప్రయోగశాల భవనాలను, జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి కంప్యూటర్ విద్య ఎంతో అవసరమని, ప్రపంచంలో మానవుడు తలుచుకుంటే సాధ్యం కాంతి ఏమీ లేదని అన్నారు. గొప్ప చదువులు చదివి సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలని, ప్రతి ఒక్కరికి సంస్కారం, ధ్యానం ఎంతో అవసరమని సూచించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉపాధ్యాయులు నూతన విద్యా బోధన చేసి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. రానున్న పరీక్ష ఫలితాలలో రాష్ట్రస్థాయిలోనే విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచేలా ఉపాధ్యాయులు విద్యను బోధించాలని, ప్రభుత్వం విద్య కోసం ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తుందని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి సమస్య తలెత్తిన ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రపంచంలో మహిళలు ఏమి తక్కువ కాదని, మహిళలు గొప్ప పదవులు నిర్వహించి ప్రపంచంలో అగ్రగామిలో నిలిచారని అన్నారు. ప్రతి విద్యార్థి పాఠశాల పరిసర ప్రాంతాలలో ఒక్క మొక్కను నాటి వాటిని సంరక్షించుకునే బాధ్యత తీసుకోవాలని, చెట్లతోనే అహల్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. ప్రతి పాఠశాలలో విద్యాబోధన పై పిల్లలకు అందిస్తున్న ఆహారంపై పరిశీలించడానికి ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని మంత్రి అన్నారు. అంతకుముందు పాలంపేటలోని రామప్ప దేవాలయం వద్ద ప్రసాద్ పథకం రూ.61.99 కోట్ల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన గడువులోగా నాణ్యత ప్రమాణాలతో పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీ రాజ్ డైరెక్టర్ భగవాన్ రెడ్డి, టూరిజం, డిఈ నటరాజ్, ఏ ఈ విజయ్, ఈ ఓ సిద్ధార్థ రెడ్డి, డి ఈ అరుణ్ కుమార్, ప్రత్యేక అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు... వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో... పోలీస్ స్టేషన్ కి బారికేడ్ల అందజేత...!!!




**జనగామ/ బచ్చన్నపేట, ఆగస్టు 4 )** జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలో... రోడ్డు ప్రమాదా నివారణే ధ్యేయంగా వాస్విక్ ఫౌండేషన్ నిత్యం కృషిచేస్తుంది. ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేష్ కుమార్, వైస్ చైర్మన్ నూకల భాస్కర్ రెడ్డిల సహకారంతో... బచ్చన్నపేట ఎస్ఐ శ్రీకాంత్ కోరిక మేరకు ఫౌండేషన్ ప్రతినిధులు ఆముదాల భూపాల్ రెడ్డి, నూకల నర్సింహ రెడ్డి బారికేడ్లను బచ్చన్నపేట పోలీస్ స్టేషన్ కి అందజేశారు. జనగామ నుండి సిద్దిపేట వైపు వెళ్లే ప్రధాన రహదారి పై వాహనాల వేగాన్ని నియంత్రించడానికి, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడానికి బారికేడ్లు అవసరమని ఎస్ఐ కోరారు. దీనికి తక్షణమే స్పందించిన వాస్విక్ ఫౌండేషన్ నిర్వాహకులు, తమ సొంత ఖర్చులతో బారికేడ్లను సిద్ధం చేయించి పోలీసు శాఖకు అప్పగించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ... సామాజిక బాధ్యతతో స్పందించి రోడ్డు భద్రతకు సహకరించిన వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు నూకల బాల్ రెడ్డి, శశిధర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, గొట్టే చంద్రమౌళి పోలీస్ సిబ్బంది రాకేష్ , తిరుపతి రెడ్డి ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ ఉద్యమ నేత..



**చిట్యాల,ఆగస్టు 4**
నకిరేకల్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ వేముల వీరేశం ను తెలంగాణ సీనియర్ ఉద్యమ నాయకులు పోలేపల్లి సత్యనారాయణ మంగళవారం నకరేకల్ లోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ప్రభుత్వ విప్ పదవి వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పోలేపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యే వీరేశంకు భవిష్యత్తులో రాజకీయంగా మరింత ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షిస్తూ, తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న నిజమైన ఉద్యమకారులను గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వంతో ఉద్యమకారులకు సరైన న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో పోకల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# రేగొండ మండల కేంద్రంలో మద్యపాన నిషేధం

- బెల్టు షాపులు, గుడుంబా సెంటర్లు బంద్ చేయాలని తీర్మానం
- ఎస్సై దాసరి సుధాకర్ కు తీర్మాన ప్రతిని అందజేసిన పాలకవర్గం






**రేగొండ, ఆగస్టు 4 (పీపుల్స్ న్యూస్)**
గ్రామ ప్రజల ఆరోగ్యం, యువత భవిష్యత్తును కాపాడడం, గ్రామంలో శాంతిభద్రతలు కాపాడడం లక్ష్యంగా రేగొండ మండల కేంద్రంలో మద్యపాన నిషేధం అమలు చేయాలని గ్రామ పంచాయతీ సర్పంచ్ వారణాసి మౌనికలి ఆధ్వర్యంలో తీర్మానం చేశారు.మంగళవారం జరిగిన గ్రామ పంచాయతీ ప్రత్యేక సమావేశంలో గ్రామ పరిధిలోని అన్ని బెల్టు షాపులు గుడుంబా సెంటర్లను వెంటనే మూసివేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ తీర్మాన ప్రతిని రేగొండ ఎస్సై దాసరి సుధాకర్ కి సర్పంచ్ వారణాసి మౌనిక, పంచాయతీ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు అందజేశారు. గ్రామంలో అక్రమ మద్యం అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, పోలీసు గస్తీని పెంచాలని వారు కోరారు. తీర్మానంలోని ముఖ్య అంశాలు గ్రామ పరిధిలో బెల్టు షాపులు, గుడుంబా విక్రయాలపై పూర్తి నిషేధంనిబంధనలు ఉల్లంఘించిన వారిపై పోలీసు చర్యలు మద్యపాన దుష్ప్రభావాలపై యువతకు, మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహణఈ నిర్ణయాన్ని గ్రామ ప్రజలు, ముఖ్యంగా మహిళలు హర్షం వ్యక్తం చేశారు. మద్యపాన రహిత గ్రామంగా రేగొండను తీర్చిద్దడానికి అందరూ సహకరించాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దంద్రే రాజ్ కుమార్, మహిళా సంఘం సిఏలు రేగూరి రజిత, మార్క సుమలత, వార్డు సభ్యులు పల్లె కల్పన, మేకల రాజు, పూజారి ప్రవళిక, మైస సురేందర్, అన్నారపు వెంకన్న, గ్రామస్తులు వారణాసి అజయ్, కూరాకుల మల్లయ్య, చిన్నాల ధనుంజయ్, కారోబార్ ముష్కే రమేష్ తది తరులు పాల్గొన్నారు.


# మాజీ మంత్రి పువ్వాడపై అనుచిత వ్యాఖ్యల చేసిన వారిపై ఫిర్యాదు




**ఖమ్మం :** మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ( ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేస్తూ దూషిస్తే ఎవర్ని సహించేది లేదని బీఆర్ఎస్ ఖమ్మం నగర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మాటేటి కిరణ్ కుమార్ ( ) స్పష్టం చేశారు. మాజీ మంత్రి పువ్వాడపై అనుచిత పదజాలంతో విమర్శించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బోడేపూడి రాజాపై ఖనాపురం హవేలి పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పెద్ద నాయకులను విమర్శిస్తే హీరో అయిపోతామని భ్రమలో మాట్లాడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఇటువంటి అనుచిత వ్యాఖ్యలు చేసి సమాజంలో జీరో కావడం తప్పితే ఎలాంటి ప్రయోజనం ఉండదని, బోడేపూడి రాజా వంటి వ్యక్తుల వల్ల కాంగ్రెస్ పార్టీకి నష్టం తప్పితే ప్రయోజనం ఏమీ ఉండదనే విషయాన్ని కాంగ్రెస్ అగ్రనేతలు గమనించాలని అన్నారు. పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పెద్ద నాయకులను విమర్శిస్తే హీరో అయిపోతామనిప్రయోజనం ఏమీ ఉండదనే విషయాన్ని కాంగ్రెస్ అగ్రనేతలు గమనించాలని అన్నారు. పోలీసులకు భ్రమలో మాట్లాడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఇటువంటి అనుచిత వ్యాఖ్యలు చేసి సమాజంలోమాజీ కార్పొరేటర్ వలరాజు , బీఆర్ఎస్ యూత్ నాయకులు మోరంపూడి సాయి కృష్ణ, విజేత, హుస్సేన్, సన్నే, మునాఫ్, చోటు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి భరోసా

**- అనారోగ్యంతో బాధపడుతున్న సాయినాథ్ నాయక్‌ను పరామర్శించిన ఆదర్శ్ రెడ్డి దంపతులు**



**పటాన్‌చెరు ఆగస్టు 04:**
పటాన్‌చెరు నియోజకవర్గం, భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ ఎం ఐ జి కాలనీలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త సునీత కుమారుడు సాయినాథ్ నాయక్ అరుదైన నరాల-కండరాల సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి మరియు భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీమతి సింధు ఆదర్శ్ రెడ్డి శనివారం వారి నివాసానికి వెళ్లి సాయినాథ్ నాయక్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా సాయినాథ్ నాయక్ ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని వారికి మనోధైర్యం కల్పించారు. మెరుగైన వైద్య చికిత్స అందేలా బీఆర్ఎస్ పార్టీ తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. చికిత్స నిమిత్తం తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేయడంతో పాటు, భవిష్యత్తులోనూ అవసరమైన అన్ని రకాల సహకారాలను అందిస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ తన కార్యకర్తలు మరియు వారి కుటుంబాలకు అండగా నిలుస్తుందని, నాయ కులు, కార్యకర్తల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడమే పార్టీ ప్రధాన బాధ్యతగా భావిస్తుందని పేర్కొన్నారు. సాయినాథ్ నాయక్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యం తో సాధారణ జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాణి యాదవ్, అరుణ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# బాలానగర్‌లో ప్రజా సమస్యలపై ప్రత్యేక సమీక్ష



- సీఎంసీ కమిషనర్ సృజనకు సమస్యల వెల్లువ..
- ముంపు, డ్రైనేజీ, శ్మశానవాటిక అభివృద్ధి తదితర అంశాలపై ప్రజలతో కలసి నేతల వినతులు

బాలానగర్ ఆగస్టు 05 ( పీపుల్స్ న్యూస్)

ప్రజలకు మెరుగైన పౌరసేవలు అందించాలనే లక్ష్యంతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ సృజన బాలానగర్ డివిజన్‌లో ప్రజా సమస్యలపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించా రు. మంగళవారం రాజుకాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో మూసాపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమం ప్రారంభంలో కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి కమిషనర్ సృజనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ప్రాంతంలో ఎదుర్కొంటున్న సమస్యలను స్పష్టంగా వివరించాలని కోరారు. ప్రజల నుంచి నేరుగా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందిం చడమే ఈ సమావేశాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కళ్యాణినగర్ ముంపుకు శాశ్వత పరిష్కారం కోరిన యుగంధర్ రెడ్డి సమావేశంలో మాట్లాడిన మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి, భారీ వర్షాలు కురిసిన ప్రతీసారి కళ్యాణినగర్ కాలనీ తీవ్ర ముంపునకు గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ మొత్తం నీటిలో మునిగిపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. తాత్కాలిక చర్యలతో కాకుండా శాశ్వత పరిష్కారం కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందిం చాలని కమిషనర్‌ను కోరారు. అదే విధంగా చెరబండరాజు నగర్‌లోని శ్మశానవాటిక అభివృద్ధి లేక నిర్లక్ష్యానికి గురవుతోందని, అవసరమైన మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు.సమస్యల జాబితాతో ముందుకొచ్చిన ప్రజలు సమావేశానికి హాజరైన వివిధ కాలనీల ప్రతినిధులు తమ ప్రాంతాల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలు, రోడ్ల దుస్థితి, వర్షపు నీటి పారుదల, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, తాగునీటి సరఫరా, ఇతర మౌలిక వసతుల సమస్యలను కమిషనర్‌కు వివరించారు. ప్రజల సమస్యలను ఓపికగా విన్న కమిషనర్ ఒక్కో అంశాన్ని అధికారులతో నమోదు చేయిస్తూ సంబంధిత విభాగాల ద్వారా పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. "సమస్యలు రాసుకోవడానికే కాదు. పరిష్కారం చూపించడానికే" -- కమిషనర్ సృజన సమావేశం అనంతరం కమిషనర్ సృజన మాట్లాడుతూ, ప్రజలు చెప్పిన ప్రతి సమస్యను నమోదు చేస్తున్నామని, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తన పరిధిలోని ప్రతి డివిజన్‌ను ప్రత్యక్షంగా సందర్శిస్తూ అక్కడి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి వాటిని కేవలం ఫైళ్లలో పెట్టడం తమ ఉద్దేశం కాదని, సమస్యల పరిష్కారం ఎంతవరకు జరిగిందో తెలుసుకునేందుకు నాలుగు నుంచి ఐదు నెలల తర్వాత మళ్లీ అదే ప్రాంతానికి వచ్చి పురోగతిని ప్రజలకు స్వయంగా తెలియజేస్తానని స్పష్టం చేశారు. అధికారులు ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేయాలన్నదే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. వివిధ రాజకీయ పార్టీల నేతల పాల్గొనిక ఈ సమావేశంలో కూకట్‌పల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లిగారి లక్ష్మయ్య, కాంగ్రెస్ ఏ-బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బందిగా బాల నరసింహ, మేడ్చల్ ఫిషర్‌మెన్ కమిటీ వైస్ చైర్మన్, బాలానగర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఆకుల నరేందర్ ముదిరాజ్, బాలానగర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసన్న కుమార్, కళ్యాణినగర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ యూసఫ్, బాలానగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు డా. కిరణ్, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు కవిత కాతురాయ, వివిధ కాలనీల అధ్యక్షులు, కార్యదర్శులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సామాజిక సంఘాల నాయకులు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యక్ష సమీక్షలకు శ్రీకారం బాలానగర్ డివిజన్‌లో నిర్వహించిన ఈ సమీక్షా సమావేశం ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లే అవకాశం లభించింది. ప్రజల సూచనలు, స్థానిక అవసరాల ఆధారంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ అధికారులను ఆదేశించడం సమావేశానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నాలుగు నుంచి ఐదు నెలల తర్వాత తిరిగి వచ్చి సమస్యల పరిష్కార పురోగతిని ప్రజలకు వివరిస్తానన్న కమిషనర్ హామీపై స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# పార్లమెంట్ మోదీ ప్రభుత్వానికి ఆటస్థలంగా మారింది

ఢిల్లీ, ఆగస్టు 4 :



అయోధ్య రామమందిరం విరా ళాల చోరీపై సభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్టేట్‌మెంట్ ఇవ్వాలని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి ) డిమాండ్ చేశారు. అయోధ్య రామ మందిరానికి భక్తులు ఇచ్చిన విరాళాలు దుర్వినియోగ మయ్యా యని తెలిపారు. (మంగళవారం) ఢిల్లీ వేదికగా మల్లు రవి మీడి యాతో మాట్లాడారు. పార్లమెంట్ ప్రజా సమస్యలపై చర్చించే వేదిక అని చెప్పుకొచ్చారు. ఒక్కరోజు కూడా పార్లమెంట్ పని చేయకుండా వాయిదాలు ఎందుకు వేస్తున్నారని ప్రశ్నించా రు. పార్లమెంట్ మోదీ ప్రభుత్వానికి ఒక ఆటస్థ లంగా మారిందని ధ్వజమెత్తారు.వేల కోట్ల రూపాయల ప్రజాధనం వృథా..సభలో ఏ మాత్రం చర్చలేకుండా బిల్లులు ఆమోదిం చుకుంటున్నారని మల్లు రవి ఆగ్రహించారు. పార్లమెంట్ నడవకపోగా వేల కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు రాజీనామా చేసిన నియోజకవర్గంలో కమలం పార్టీ అభ్యర్థి ఓడిపోయారని ఎద్దేవా చేశారు. ప్రధాని, కేంద్ర హోం మంత్రి, ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించకపోవడంతోనే బీజేపీకి వ్యతిరేకత వచ్చిందని తెలిపారు.ఉప ఎన్నికల్లో బీజేపీ ఒక చోట గెలిచిందిమూడు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగితే బీజేపీ ఒక చోట మాత్రమే గెలిచిందని మల్లు రవి అన్నారు. బీజేపీ త్వరలో భారీ మూల్యం చెల్లించాల్సి వ స్తుందని హెచ్చరించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని శాంతియుతంగా ఆందోళన చేసిన విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ప్రయోగించారని మండిపడ్డారు. ఈ విషయంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇవ్వాలని మల్లు రవి డిమాండ్ చేశారు.


# అభిజీత్ దీప్కేను అరెస్టు చేయండి



ఢిల్లీ, ఆగస్టు 4 : సీజేపీ (కాక్రోచ్ జనతా పార్టీ) ఫౌండర్ అభిజీత్ దీప్కేపై ఒక సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతడి అనుచరులు తనపై వరుసగా దాడికి పాల్పడ్డార ని, దీనికి బాధ్యుడిగా అభిజీత్ దీప్కేను అరెస్టు చేయాలని కోరుతూ ఫిర్యాదు చేశాడు. నీట్ పేపర్ లీకేజీపై ఆందోళన అనంతరం అభిజీత్ దీప్కేపై ఏదో ఒక వివాదం నడుస్తూనే ఉంది. తాజాగా అతడిపై పోలీసు కేసులు నమోదయ్యా యి. తాజా ఫిర్యాదుకు సంబంధించిన వివరాలివి. ఫైజన్ అన్సారీ అనే అతడు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా గుర్తింపు తెచ్చుకు న్నాడు.అతడిపై ఇటీవల పూనేలో, ఔరంగాబా ద్‌లో దీప్కే అనుచరులు దాడి చేశారు. ఈ విషయాన్ని ఫైజన్ అన్సారీ యే వెల్లడించాడు. ఇందుకు సంబంధిం చి తన వద్ద ఆధారాలున్నా యని, ఈ నేపథ్యంలో అభిజీత్ దీప్కేపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఢిల్లీ డీసీపీకి ఫిర్యాదు చేసినట్లు ఫైజన్ పేర్కొన్నాడు. ఇప్పటికే ఇదే అంశంపై రెండు చోట్ల ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశానన్నాడు. ఢిల్లీ పోలీసులు కూడా వెంటనే స్పందించి, దీప్కేను అరెస్టు చేయాలని అతడు కోరాడు. ఇదే సమయంలో ఢిల్లీ పోలీసులు, ప్రభుత్వంపై ఫైజన్ ప్రశంసలు కురిపించాడు. పోలీసులు సరైన సమయంలో స్పందించి, సోనమ్ వాంగ్‌చుక్‌ను అరెస్టు చేశారని చెప్పాడు. కొద్ది రోజులుగా నిరాహార దీక్ష చేసిన సోనమ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని, ఆస్పత్రికి తరలించిన సంగతి తెలిసిందే. ఈ సమయంలో వాంగ్‌చుక్‌ను పోలీసులు అరెస్టు చేసి, మంచి పని చేశారని, లేకుంటే పరిస్థితులు మరింత దిగజారిపోయేవని ఫైజన్ అన్నాడు.దీప్కేకు స్వప్రయోజనాలే ముఖ్యమని, ప్రతి అంశాన్ని తన ప్రయోజనం కోసమే వాడుకుంటాడని ఫైజన్ ఆరోపించాడు.

# బంకీపుర్ తీర్పు బీజేపీకి బిగ్ వార్నింగ్- సీఎంను మార్చాలనేదే ప్రజల సందేశం

న్యూ ఢిల్లీ :జనసురాజ్ వ్యవస్థాపకుడు, బంకీపుర్ ఉప ఎన్నికలో విజయం సాధించిన ప్రశాంత్ కిశోర్ బీజేపీ, ఎన్‌డీఏ నాయకత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. బంకీపుర్ ఉపఎన్నిక ఫలితం బిహార్ ప్రజల తీర్పు మాత్రమే కాదని, రాష్ట్ర నాయ కత్వంపై స్పష్టమైన సందేశమని ఆయన వ్యాఖ్యా నించారు. ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరీ వ్యవ హారశైలి, వ్యక్తిత్వం, నాయకత్వాన్ని ప్రజలు అం గీకరించడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం మార్చాలని ప్రజలు కోరడం లేదని, కానీ రాష్ట్రానికి మెరుగైన నాయ కత్వాన్ని ఇవ్వాలని బీజేపీ కేంద్ర నాయకత్వానికి సంకేతం పంపారని పేర్కొన్నారు.'రోడ్లు దెబ్బ తినలేదు- కొత్తగా సమస్యలు రాలేదు' ఉపఎన్ని క ఫలితాల అనం తరం మంగళవారం మీడియాతో మాటా ్లడిన ప్రశాంత్ కిశోర్, బిహార్‌లో ప్రస్తుతం చర్చలు నేరాలు, ఎన్‌కౌం టర్లు, కుల రాజకీ యాల చుట్టూ తిరుగుతున్నాయని విమర్శిం చారు. ఇవన్నీ పక్కనపెట్టి విద్య, ఉపాధి, వలసల వంటి ప్రజలకు సంబంధించిన అంశా లపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. అధికారంలోకి వచ్చినప్పుడు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉం దన్నారు. గత ఏడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే బంకీపుర్ నియో జకవర్గంలో బీజేపీకి 51 వేలకుపైగా మెజార్టీ వచ్చిందని గుర్తుచేశారు. అప్పటి నుంచి నియో జకవర్గంలో రోడ్లు దెబ్బతినలేదని, కొత్తగా ఎలా ంటి సమస్యలు రాలేదని చెప్పారు. అయి నప్పటికీ అదే ప్రజలు ఇప్పుడు బీజేపీని ఓడిం చారని పేర్కొన్నారు. ఈ మార్పుకు కారణం స్థానిక సమస్యలు కాదని, రాష్ట్రంలో బీజేపీ తీసుకొచ్చిన కొత్త నాయకత్వ మేనని అన్నారు.' బీజేపీ కి పరాజ యం ఎదురైంది అందుకే' అయితే ప్రజలు తిరస్కరించింది బీజేపీ సిద్ధాంతాన్ని కాదని, ప్రస్తుతం రాష్ట్రానికి నాయకత్వం వహిస్తున్న వ్యక్తిని అని ప్రశాంత్ కిశోర్ ఆరోపిం చారు. ఆయన ప్రవర్తన, వ్యక్తిత్వం, ప్రజల్లో ఉన్న ఇమేజ్ అంగీకారయోగ్యంగా లేదని వ్యాఖ్యానించారు. అందుకే బంకీపుర్ ప్రజలు తమ ఓటు ద్వారా స్పష్టమైన సందేశం ఇచ్చారని చెప్పారు. మరోవైపు జంగిల్ రాజ్ అంశంపైనా ప్రశాంత్ కిశోర్ విమర్శలు గుప్పించారు. గతంలో జంగిల్ రాజ్‌కు వ్యతిరేకంగా ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగిన బీజేపీ, అదే తరహా రాజకీయాలకు ప్రతీకగా భావించే వ్యక్తిని కాషాయ కండువా కప్పి ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోబెడితే ప్రజలు అంగీకరించరని వ్యాఖ్యానించారు. అందుకే బీజేపీకి పరాజయం ఎదురైందన్నారు.'ప్రజా సమస్యలపై పోరాటం చేస్తే'అయితే బిహార్‌లో ప్రభుత్వం మారబోతుందన్న ప్రచారాన్ని ప్రశాంత్ కిశోర్ ఖండించారు. ఎన్‌డీఏకి అసెంబ్లీలో స్పష్టమైన మెజార్టీ ఉందని, ఆ ప్రభుత్వం కొనసాగే అవకాశమే ఎక్కువగా ఉందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం కూలే పరిస్థితి లేదని, కానీ ముఖ్యమంత్రి నాయకత్వంలో మార్పు రావచ్చని అభిప్రాయపడ్డారు. ప్రజల తీర్పు కూడా అదే దిశగా ఉందని చెప్పారు. ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ భవిష్యత్తుపై కూడా స్పందించారు. ప్రస్తుతం ఆయన ప్రతిపక్ష నేతగా ఉన్నారని, వచ్చే నాలుగేళ్లలో ప్రతిపక్ష పాత్రను ఎంత సమర్థంగా పోషిస్తారన్న దానిపైనే ఆయన రాజకీయ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని అన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తే మరింత బలపడే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.



# ఈ20 పెట్రోల్ అమ్మకండి.. పంజాబ్ అసెంబ్లీలో తీర్మానం



చండీఘడ్: దేశవ్యాప్తంగా ఈ20 పెట్రోల్‌అమ్మకాలపై ఆందోళన వ్యక్తం అవుతున్న విషయం తెలిసిందే. ఇథనాల్ కలిపిన పెట్రోల్ వల్ల వాహనాలు దెబ్బతింటున్నట్లు కొన్ని చోట్ల ఫిర్యాదులు అందాయి. అయితే దేశవ్యాప్తంగా ఈ20 పెట్రోల్ వాడకాన్ని నిషేధించాలని కోరుతూ ఇవాళ పంజాబ్ అసెంబ్లీలో తీర్మానం పాస్ చేశారు. 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ అమ్మకాన్ని పంజాబ్ అసెంబ్లీ వ్యతిరేకించింది. ఇథనాల్ ఫ్రీ పెట్రోల్‌తో పాటు ఈ20 పెట్రోల్ ఎంపిక చేసుకునే అవకాశం వినియోగదారుడికి ఇవ్వాలని సభలో డిమాండ్ చేశారు. ఈ20 పెట్రోల్‌కు తగినట్లు డిజైన్ లేని వాహనాల్లో దాన్ని వాడడం వల్ల సమస్యలు వస్తున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.ఈ20 వాడకం వల్ల వాహనాల్లో మైలేజీ తగ్గుతుంది కాబట్టి, ఆ సామర్థ్యానికి తగినట్లు ఈ20 పెట్రోల్ రిటేల్ ధరను తగ్గించాలని తీర్మానంలో కోరారు. ఆటోమొబైల్ ఇంజినీర్లు, పెట్రోలియం నిపుణులు, పర్యావరణ శాస్త్రవేత్తలు, వినియోగదారుల సంఘాలు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులతో ఓ వ్యక్తిగత కమిటీని ఏర్పాటు చేసి ఇథనాల్ కలిపిన పెట్రోల్‌పై సమగ్రమైన స్టడీ చేయాలని తీర్మానంలో కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

# ఇద్దరు సహచర జవాన్లను కాల్చి చంపిన సీఆర్పీఎఫ్ జవాన్.

న్యూ ఢిల్లీ :ఇద్దరు సహచర జవాన్లను కాల్చి చంపిన ఒక జవాన్ ఆ తర్వాత తాను కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనలో మరో జవాన్‌కు కూడా గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం ఉదయం ఏడు గంటలకు అసోంలోని, నాగోన్ జిల్లా, కాటిమారిలోని సీఆర్పీఎఫ్ 34 బెటాలియన్ పరిధిలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలివి. నిందితుడిని అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (జీడీ) బల్లాని ప్రేమాంబరంగా గుర్తించారు. అతడు ఈ క్యాంపులో విధులు నిర్వహిస్తుండగా, మెయిన్ గేట్ వద్ద ఈ దారుణానికి పాల్పడ్డాడు.ఈ ఘటనపై నాగోన్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ డీఎస్పీ పారమిత సర్కార్ మాట్లాడుతూ.. ప్రేమాంబరం ఉన్నట్లుండి తోటి జవాన్లపై కాల్పులకు పాల్పడ్డాడు. అక్కడే ఉన్న హెడ్ కానిస్టేబుల్ విష్ణు ప్రసాద్, సబ్ ఇన్‌స్పెక్టర్ రమ్నావాల్ సింగ్ యాదవ్‌పై కాల్పులు జరపడంతో వారు ఇద్దరూ మరణించారు. అలాగే, గోవింద్ శ్రీపుల్ అనే మరో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌కు గాయాలయ్యాయి. అతడిని వెంటనే ఉన్నతాధికారులు స్థానిక ఆస్పత్రిలో చేర్చి, చికిత్స అందిస్తున్నారు. అతడి, ఆరోగ్యానికి సంబంధించిన పూర్తి వవరాలేవీ ఇంకా తెలియరాలేదు. ఇక, ముగ్గురిపై కాల్పులు జరిపిన అనంతరం నిందితుడు ప్రేమాంబరం తాను కూడా కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

# ఈ20 పెట్రోల్‌పై ఆప్ ఆందోళన- ప్రధాని నివాసం వైపు కేజ్రీవాల్ మార్చ్

న్యూ ఢిల్లీ : ఈ20 పెట్రోల్‌కు వ్యతిరేకంగా ప్రధాని నివా సం వైపు పాదయాత్రగా వెళ్తున్న ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సహా, ఆ పార్టీ ము ఖ్య నేతలను మంగళవారం దిల్లీ పోలీసులు అడ్డుకున్నారు. 5, ఫిరోజ్ షా రోడ్డు దాటి ముం దుకు వెళ్లడానికి అనుమతించమని స్పష్టం చేశా రు. దీనితో కేజ్రీవాల్, దిల్లీ మాజీ ఉపముఖ్య మంత్రి మనీశ్ సిసోదియా, అప్ మహిళా నేత జాస్మిన్ షా సహా ఆ పార్టీ కార్యకర్తలు ఫిరోజ్ షా రోడ్డుపై నిరసనకు దిగారు.ఇథనాల్ కలిపిన పెట్రోల్ వల్ల వాహన యజమానులపై ప్రతికూల ప్రభావం పడుతోందని ఆప్ ఆరోపి స్తోంది. ఈ20 పెట్రోల్?ను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రజలు నుంచి వినతి పత్రాలను సేకరించింది. ఇలా



సేకరించిన 2.30 లక్షలకు పైచిలుకు వినతి పత్రాలను సమర్పించేందుకు కేజ్రీవాల్? మంగళవారం ప్రధాని నివాసానికి బయలుదేరా రు. ఆయనతోపాటు మరో 100 మంది పార్టీ కార్యకర్తలు ఉన్నారు. అంతకు ముందు ఆయన ర్యాలీలో మాట్లా డుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. "దేశవ్యాప్తంగా ప్రజలు సంతకాలు చేసిన2.30 లక్షలకు పైగా వినతి పత్రాలతో మేము ప్రధాని నివాసానికి వెళ్తున్నాము. ఈ20 పెట్రోల్ వల్ల ఇబ్బందులు పడుతున్న కోట్లాది వాహన యజ మానుల గొంతును మేము వినిపించాలని కోరుకుంటున్నావు" అని అన్నారు. ప్రధానికి కేజ్రీవాల్ లేఖఇథనాల్ కలిపిన పెట్రోల్‌పై వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, దీనిపై చర్చించడానికి అపాయింట్ మెంట్ ఇవ్వాలని అరవింద్ కేజ్రీవాల్ ఇంతకు ముందు ప్రధాని మోదీకి లేఖ రాశారు. స్వచ్ఛమైన పెట్రోల్, ఈ20 పెట్రోల్? అనే రెండు ఆప్షన్లలో, తమకు నచ్చినదానిని ఎంచుకునే అవకాశం వినియో గదారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నప్ప టికీ ప్రభుత్వం మాత్రం తన విధానాన్నే కొనసాగిస్తోందని విమర్శించారు. అమెరికా లొంగిపోయిన మోదీ ప్రభుత్వం ఇథనాల్ ఆరోపించారు"వాహన యజమానుల నుంచి ఫిర్యాదులు వస్తున్నప్పటికీ, ప్రభుత్వం ఈ20 పెట్రోల్‌ను ఎందుకు బలవంతంగా అమలు చేస్తోందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు స్వచ్ఛమైన పెట్రోల్ లేదా ఈ20 పెట్రోల్- వీటిలో ఏదో ఒకటి ఎంచుకునే అవకాశం ఉండాలని మాత్రమే మేము కోరుకుంటున్నాం. ఒక వేళ ఈ20 పెట్రోల్?నే ప్రోత్సహిస్తున్నట ్లయితే, దానిని తక్కువ ధరకే విక్రయించాలని మేము డిమాండ్ చేస్తున్నాం" అని అన్నారు.

# సంపాదకీయం

## బిజెపి ఆత్మపరిశీలనకు ఇదే సమయం !



కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మేల్కోవాల్సిన సమయం వచ్చింది. ఇక్కడ బిజెపి అంటే మోడీ, అమిత్ షా మాత్రమే అని చెప్పుకోవాలి. ఎందుకంటే అధకారంలోనూ, పార్టీలోనూ ఈ ఇద్దరిదే పెత్తనం కనుక వీరిద్దరు మేల్కొంటే బిజెపి మేల్కొన్నట్లుగానే చూడాలి. ఎందుకంటే బిజెపి పాలనలో ప్రజల పట్ల మెల్లగా వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. వీటిని ఆ ఇద్దరు ఎంత త్వరగా గుర్తిస్తే అంతమంచిది. ఉప ఎన్నికలు జరిగిన మూడు రాష్ట్రాల్లో బిజెపి కేవలం గుజరాత్‌లో ఒక్కసీటు మాత్రమే గెల్చుకోలిగింది. బీహార్, మధ్యప్రదేశ్‌లలో అధికారంలో ఉన్నా, అక్కడ గెలవలేదు. సాధారణంగా అధికారంలో ఉన్నచోట ఉప ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులే గెలుస్తారు. కానీ అనూహ్యంగా బిజెపి పట్ల ప్రజలు తీవ్ర వ్యతిరేకత కనబర్చారు. మొన్నటికి మొన్న నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థులు గళమెత్తారు. విద్యార్థుల పార్లమెంటు ముట్టడి గర్జనకు విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామానే చేయక తప్పని పరిస్థితి వచ్చింది. ఇది తమ ఎత్తుగడే అని బిజెపి నేతలు సమర్థించుకున్నా అంతిమంగా విజయం విద్యార్థుల వైపే ఉంది. తాము ఎన్నుకున్న ప్రభుత్వాలే తమ భవిష్యత్తును నట్టేట ముంచుతుంటే ఓపిక, సహనం నశించి తీవ్రమైన ఆవేదన, ఆవేశం, ఆక్రోశంతో యువత రగిలి చేసిన పోరాటంగా దీనిని చూడాలి. ప్రారంభంలో విద్యార్థుల పోరాటాన్ని బేఖాతరు చేసిన ప్రధాన మీడియా చానెళ్లు కూడా తదనంతరం తప్పనిసరి పరిస్థితుల్లో మేల్కొన్నాయి. వారి పోరాటాన్ని గుర్తించక తప్పలేదు. ఈ పోరాటం వెనక ఎవరు ఉన్నారన్నది తెలుసుకుంటూనే, విద్యార్థుల్లో ముఖ్యంగా యువతలో నిద్రాణంగా ఉన్న ఆక్రోశాన్ని కూడా గుర్తించాలి. అందుకే బిజెపి నేతలు విదేశీ హస్తం ఉంటే గుర్తించి చర్యలు తీసుకోవడం ఒక ఎత్తయితే..యువతలో నివురుగప్పిన నిప్పులా ఉన్న ఆందోళనలను కూడా గుర్తించాలి. విద్యార్థులు చేసిన ఏ ఉద్యమం కూడా విఫలమైనట్టు ప్రపంచ చరిత్రలో లేదు. అది వివిధ దేశాల స్వాతంత్ర్య ఉద్యమాల నుంచి ప్రత్యేక తెలంగాణ ఉద్యమంతో పాటు ఇప్పుడు కాక్రోచ్‌ల ఉద్యమం వరకు రుజువైంది. విద్యార్థులు, యువతతో పెట్టుకున్న ఏ ప్రభుత్వాలూ, పార్టీలూ మనుగడ సాగించలేవు. ఎంతటి బలమైన నియంతృత్వ ప్రభుత్వమైనా విద్యార్థుల పోరాటానికి తారుమారైన చరిత్ర ఉంది. విద్యార్థులే కదా అని అలుసుగా తీసుకుంటే అధికారం గల్లంతవుతుంది. బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, ఇతర ఆఫ్రికా దేశాల్లో జరిగిన అనేక ప్రజా ఉద్యమాలను చూసిన తరవాత మనం కూడా జాగ్రత్త పడాలి. అలాంటి పరిస్థితి ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో భవిష్యత్తులో రాకుండా ఉండాలంటే సమస్యలను పక్షపాత ధోరణితో సాగదీయకుండా పాలకులు, ప్రభుత్వాలు పరిష్కరించాలి. అధికారం శాశ్వతం అనుకుంటే... వారి రాజకీయ మనుగడకు ప్రమాదం వాటిల్లుతుంది. భవిష్యత్తులో ఇంతకంటే తీవ్ర స్థాయిలో విద్య, ఉద్యోగ, రాజకీయంగా అణచివేయబడ్డ అనేక సామాజిక వర్గాల నుంచి ప్రతిఘటనలు ఎదుర్కోవాల్సి వస్తుందని గుర్తించాలి. ఇకపోతే ఇదొక్కటే అనుకుంటే పొరపాటు. ఎన్నికల్లో కూడా ప్రజలు మెల్లగా మోడీ పాలనపై వ్యతిరేకత వ్యక్త పరుస్తున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని 242 సీట్లకు పరిమితం చేశారు. ఇదే మొదటి హెచ్చరిక. ఇక ఇప్పుడు తాజా ఉప ఎన్నికల ఫలితాలు మరో హెచ్చరికగా చూడాలి. చాపకింద నీరులా ప్రజల్లో నివురుగప్పిన అసంతృప్తిని గుర్తించాలి. పాలనలో మూస పద్ధతి నుంచి బయటపడాలి. ధరల పెరుగుదల, నిరుద్యోగం, పన్నులు వంటివి ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఆస్పత్రులు, విద్యారంగం మరీ దిగజారి పోతున్నాయి. సమాజంలో ప్రతి ఒక్క రంగం జనాలను జలగల్లా పీల్చి పిప్పి చేస్తున్నాయి. వీటిని తక్షణం సమీక్షించుకోక పోతే ఇది పెను ఉప్పెనలా విరుచుకు పడడం ఖాయం. ఎందుకంటే ఉప ఎన్నికలు, విద్యార్థుల ఆందోళనలను బిజెపి నేతలు సీరియస్‌గా తీసుకుని సమీక్షించుకోవాల్సిన అత్యవసర పరిస్థితి ఇది. బిహార్‌లోని బాంకీపూర్ శాసనసభ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో జన్ సురాజ్ పార్టీ అధినేత, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ విజయం రాష్ట్ర, దేశ రాజకీయాల్లో విస్తృత చర్చకు దారితీసింది. ఉప ఎన్నికలో ఆయన నీరజ్‌కుమార్ సిన్హా అనే బీజేపీ అభ్యర్థిపై విజయం సాధించి ఉండవచ్చు. కానీ, నిజానికి ఆయన ఓడించింది బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్‌నే అని గుర్తించాలి. ఒక్క నితిన్‌నే కాదు మోడీ, అమిత్ షాలను అని కూడా గుర్తించాలి. పదిహేనేళ్ళ క్రితం వరకూ పాట్నా వెస్ట్‌గా ఉన్న ఈ అర్బన్ అసెంబ్లీ స్థానాన్ని వరుసగా ఐదుసార్లు ఘనంగా నెగ్గుకొచ్చిన నితిన్ నబీన్ రాజ్యసభకు తరలడంతో ఈ ఉపఎన్నిక అనివార్యం అయ్యింది. దీనికితోడు, బీజేపీ అధ్యక్షుడి కంటే ముందు ఆయన తండ్రి కిశోర్ ప్రసాద్‌సిన్హా సైతం ఏకబిగిన పలుమార్లు గెలుచుకున్నస్థానం కావడంతో ఈ శాసనసభ ఉపఎన్నిక ఫలితం యావత్ దేశాన్ని ఆకర్షించింది. బిహార్‌లో సామ్రాట్ చౌదరి నేతృత్వంలోని తొలి బీజేపీ ప్రభుత్వానికి ఎదురైన తొలి ఎన్నికల పరీక్ష ఇది. కాయస్థ, భూమిహార్, రాజ్‌పుట్ ఇత్యాది అగ్రకులాల సంఖ్యాబలం గణనీయంగా ఉన్న ఈ స్థానం చేజారిపోవడం కచ్చితంగా ఆ పార్టీ పెద్దలకు ఆందోళన కలిగించే అంశం. గత ఏడాది ఎన్నికల్లో ఆర్జేడీ అభ్యర్థిపై నితిన్ నబీన్ యాభైవేల మెజారిటీతో గెలిచారన్నది దృష్టిలో ఉంచుకుంటే ఇప్పటి పరాజయం తీవ్రత అర్థమవుతుంది. నీట్ పరీక్షలో అవకతవకలు, పిల్లల ఆత్మహత్యలు, ఉధృతంగా సాగిన జెన్‌జీ ఉద్యమం, ఉద్యోగ ఉపాధి అవకాశాల లేమి వంటివి ఈ ఫలితాలను ప్రభావితం చేశాయని చెప్పకతప్పదు. బీజేపీకి గుణపాఠం నేర్పాలన్న లక్ష్యంతో యువతతో పాటు, వారి మనోభావాలకు అనుగుణంగా మధ్యవయసువారు, వృద్ధులు కూడా ఓట్లేశారని, అన్ని కులాలవారు, రంగాలవారు ఏకరీతిన నడిచారని విశ్లేషణలు చెబుతున్నాయి. దేశంలో ప్రతిపక్షపార్టీలు బలహీనంగా ఉండవచ్చు, కానీ, ప్రతిపక్ష స్థానం మాత్రం బలంగానే ఉంది అంటూ పీకే చేసిన వ్యాఖ్యను ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. ఇవి కొన్ని హెచ్చరికలు మాత్రమే. అలాగే ఆత్మపరిశీలన చేసుకోవడానికి వచ్చిన అవకాశంగా బిజెపిలోని మిత్రద్వయం గుర్తించాల్సన సమయమిది. దేశంలో పాలన బాగుందని తమకు తాము భుజాలు ఎగరేసుకుంటే సరికాదు. ప్రజలు ఏమనుకుంటున్నారో అన్నది తెలుసుకోవడం ముఖ్యం. ముఖ్యంగా విద్యార్థుల కోణంలో విద్యారంగంలో గణనీయమైన మార్పులకు శ్రీకారం చుట్టాలి. ఉపాధి, ఉద్యోగ రంగాల్లో మార్పులను తీసుకుని రావాలి. యువత వీటికోసం ఎదురు చూస్తోంది. పన్నులు, ధరలు, విద్యారంగ దోపిడీ, వైద్యరంగంలో దోపిడీ గురించి సామాన్య ప్రజలు సైతం ఆగ్రహంగా ఉన్నారు. ఇవన్నీ కూడా పరిష్కరించగలిగినవే. రాజకీయాల్లో విప్లవాత్మక మార్పులతో ప్రజలకు పాలనను

# ప్రశాంత్ కిశోర్ విజయంతో మారనున్న సమీకరణాలు

**• బిజెపి సహా అన్ని పార్టీలకు ఇక ముప్పే**



**పాట్నా,ఆగస్ట్4:** బీహార్‌లో బిజెపి తీరును ప్రజలు వ్యతిరేకిసక్తున్నారనడానికి బాంకీపూర్ ఉప ఎన్నిక ఫలితమే నిదర్శనమని చెప్పాలి. బిజెపి కంచుకోటను వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ బద్దలు కొట్టారు. నిజానికి అక్కడ ప్రజలు బిజెపి పట్లా అదే విధేయతను ప్రకటించడం లేదని తేలింది. బాంకీపూర్‌ను నిలబెట్టుకోవడం కోసం బీజేపీ అన్ని అడ్డదారులూ తొక్కిందని, పోలీసు ఉన్నతాధికారులు దానికి ఏజెంట్లుగా పనిచేశారని, తన పార్టీ కార్యకర్తలను జైళ్ళలో కుక్కారని ప్రశాంత్ కిశోర్ పెద్ద పెద్ద ఆరోపణలు చేశారు. అయినా బిజెపి గెలవలేక పోయిందని విమర్శించారు. ఐదేళ్ళక్రితం ఎన్నికల వ్యూహకర్త పాత్రకు స్వస్తిచెప్పి, రెండేళ్ళపాటు బిహార్ అంతా కాలినడకన కలయదిరిగి, ఒక ఆదర్శవంతమైన మేనిఫెస్టోతో ఆయన రాజకీయ రంగప్రవేశం చేశాడు. తాను ఎన్నికల్లో నిలబడకుండా, ఓ ఐదు అసెంబ్లీ స్థానాలు మినహా అన్నింటిలోనూ తన పార్టీ అభ్యర్థులను నిలబెట్టాడు. ఓ మూడున్నరశాతం ఓటువాటా దక్కింది కానీ, ఒక్కరంటే ఒక్కరు కూడా గెలవలేదు. ఆ ఘోర పరాజయం నుంచి ఏడాది తిరిగేసరికి ఇప్పుడు దక్కిన విజయం ఆయనకు పెద్ద ఉపశమనం. తాను ఇప్పుడు ఓడినా పోయేదేమీ లేదని, ఒకవేళ నెగ్గితే, ఏకంగా బీజేపీ అధ్యక్షుడి కుటుంబాన్ని ఢీకొని, కంచుకోటను స్వాధీనం చేసుకున్న ఘనత దక్కుతుందని పీకే అనుకొనివుంటారు. ఒక ఎమ్మెల్యే సీటు కంటే, దేశంలో కొద్దినెలలుగా చోటుచేసుకుంటున్న పరిణామాల ప్రభావం ఓటర్లమీద ఏ స్థాయిలో ఉన్నదో, బిహార్ ఓటర్లు ప్రత్యామ్నాయం గురించి చూస్తున్నదీ లేనిదీ తేల్చుకోవాలనుకొని ఉంటారు. అగ్రకులాలతో పాటు, యాదవులు, ముస్లింలు, దళితులు, ఎంబీసీ, ఈబీసీ ఓటర్లు సైతం ప్రశాంత్‌కిశోర్‌కు ఓటుచేయడం వల్లనే 20వేల మెజారిటీ సాధ్యపడిందని విశ్లేషకుల అభిప్రాయం. సర్వసాధారణంగా ఉపఎన్నికల్లో అధికారపార్టీయే విజయాలు సాధిస్తుంది. కానీ, బిహార్ పరిస్థితి వేరు. శాసనసభ ఎన్నికల పోరుకు సారథ్యం వహించి, కూటమిని గెలిపించి, అనేక నాటకీయ పరిణామాల మధ్య అనతికాలంలోనే నితీశ్‌కుమార్ తప్పుకున్నారు. అనూహ్యంగా తెరమీదకు వచ్చిన తొలి బీజేపీ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి మీద రాష్ట్ర ప్రజల తొలి తీర్పు ఇది అని పీకే పార్టీ ఆరోపిస్తోంది. బిహార్‌తో పాటు, తన ఏలుబడిలో ఉన్న మధ్యప్రదేశ్‌లోనూ మరో స్థానాన్ని కోల్పోయిన బీజేపీకి, మోదీ స్వరాష్ట్రం గుజరాత్ ఒక్కటే ఉపశమనాన్ని ఇచ్చింది. ఇదంతా ఒక్ ఎత్తయితే బీహార్‌లో ప్రశాంత్ కిశోర్ రాజకీయ ప్రస్థానానికి పునాది పడిందని చెప్పుకోవాలి. ఈ ఒక్కసీటుతో పికె ఇక దూకుడు ప్రదర్శించే అవకాశం ఉంది. బిజెపి, ఆర్జెడి, నితీశ్ పార్టీలో ఉన్న అసంతృప్తిని తనకు అనుకూలంగా మలచుకునే సత్తా పికెకు ఉంది. రానున్న రోజుల్లో అక్కడ పికె ప్రభావం పెరిగినా ఆశ్చర్య పడాల్సిన పనిలేదు.

# మరో బాదుడుకు సిద్ధం అవుతున్న ట్రంప్

**- హెచ్-1బీ, ఎల్-1 పిటిషన్ల రెన్యువల్స్‌పై అదనపు ఫీజు**



**వాషింగ్టన్,ఆగస్ట్4:** వలసలపై ఉక్కుపాదం మోపుతున్న ట్రంప్ సర్కారు మరో వీసా ఫీజును తెరపైకి తెచ్చింది. బడా కార్పొరేషన్ల హెచ్-1బీ, ఎల్-1 పిటిషన్ల రెన్యువల్స్‌పై అదనపు ఫీజు విధించేలా ప్రతిపాదనలను సిద్ధం చేస్తుంది. ఈ దిశగా 9-11 రెస్పాన్స్ అండ్ బయోమెట్రిక్ ఎంట్రీ-ఎగ్జిట్ ఫీజును వీసా రెన్యూవల్స్‌కు వర్తించేలా రూపొందించిన నిబంధనలు తుది రూల్ మేకింగ్ దశకు చేరుకున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇది అమల్లోకి వస్తే కంపెనీలకు హెచ్-1బీ వీసాదారులను కొనసాగించడం మరింత భారంగా మారుతుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. సగానికి పైగా హెచ్-1బీ వీసాదారులు, ఎల్-1వీ వీసాదారులు ఉన్న అమెరికన్ కంపెనీలపై ఈ అదనపు ఫీజును విధించేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ, కార్మిక శాఖ, విదేశాంగ శాఖ కసరత్తు చేస్తున్నాయి. ప్రస్తుతం ఇలాంటి బడా సంస్థలు కొత్త విదేశీ వర్కర్లను స్పాన్సర్ చేసే సమయంలో హెచ్-1బీ, ఎల్-1 పిటిషన్లపై అదనంగా 4 వేల డాలర్ల ఫీజును చెల్లిస్తున్నాయి. ఇకపై విదేశీ ఉద్యోగిని కొనసాగించేందుకు చేసే రెన్యూవల్స్ విషయంలోనూ ట్రంప్ సర్కారు అదనపు ఫీజు విధించే అవకాశం ఉంది. అమెరికా పౌరసత్వ, వలస సేవల శాఖ లెక్కల ప్రకారం, ప్రభుత్వం జారీ చేసే హెచ్-1బీ అనుమత్లో అధిక శాతం రెన్యువల్స్‌కు సంబంధించినవే. 2025 సెప్టెంబర్ 30తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో 4.06 లక్షల హెచ్-1బీ అప్లికేషన్లను ఆమోదించగా వాటిల్లో 71 శాతం రెన్యూవల్స్‌కు సంబంధించినవేనని తేలింది. కాబట్టి ఈ ఫీజు కూడా అమల్లోకి వస్తే భారతీయులపై మరింత భారం పెరిగే అవకాశం ఉందన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి.

# చర్చలకు రాకుండా మోసపూరిత వ్యవహారం

**• ఇరాన్‌కు మరోమారు ట్రంప్ అల్టిమేటం • ఇరాన్‌ను లొంగదీసుకునే ప్రత్యామ్నాయాలపై గురి**



**వాషింగ్టన్,ఆగస్ట్4:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ నాయకత్వానికి అల్టిమేటం ఇచ్చారు. అమెరికాతో ఒప్పందం చేసుకోవాలని.. అలాకాకపోతే పూర్తిగా లొంగిపోవాలని తేల్చి చెప్పారు. సోమవారం తన సొంత సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ది ట్రూత్ సోషల్‌లో ఓ సుదీర్ఘ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో ఇరాన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇరాన్ మోసపూరితంగా వ్యవహరిస్తోందని అన్నారు. ఇరాన్ చర్చల కోసం తమను ప్రాధేయపడిందని, ఇప్పుడు బహిరంగంగా చర్చలు కుదరవంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్ దీన్ని అంగీకరించినా.. అంగీకరించకపోయినా.. దశాబ్దాలుగా వాళ్లు సృష్టించిన ఓ సమస్యకు పరిష్కారం గురించి మేము మాట్లాడుతున్నాం. హోర్ముజ్‌పై తమ నియంత్రణ కొనసాగుతుందని ఇరాన్ నాయకత్వం ఎప్పటిలాగే వ్యర్థమైన మాటలు చెబుతోంది. కానీ, హోర్ముజ్ జలసంధి ఇప్పటికే అమెరికా నియంత్రణలో ఉంది. హోర్ముజ్ 'ది యునైటెడ్ స్టేట్స్ వాల్ ఆఫ్ స్టీల్' కంట్రోల్‌లో ఉంది. జలసంధిలో ప్రయాణం పూర్తిగా అమెరికా ఇష్టాయిష్టాలపైనే ఆధారపడి ఉంటుంది. ఇరాన్ వద్ద ఎప్పటికీ అణ్వాయుధం ఉండదు' అని స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించడం కోసం అమెరికా పెట్టిన షరతులను ఇరాన్ అంగీకరించట్లేదు. ఈ నేపథ్యంలోనే టెహ్రాన్‌ను టార్గెట్ చేసేందుకు కొత్త మార్గాలు వెతకాలని అమెరికా సెంట్రల్ కమాండ్ తమ బలగాలకు ఈ-మెయిల్ పంపినట్లు తెలుస్తోంది. ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చి, దాని అణు కార్యక్రమాలను నిలిపివేసేలా చేయడం కోసం వినూత్న, సంప్రదాయేతర సూచనలు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. దీంతో ఇప్పటి వరకు టెహ్రాన్‌పై దాడులకు వాషింగ్టన్ అమలు చేసిన వ్యూహాన్ని సెంట్రల్ కమాండ్ అధికారులు పునఃపరిశీలిస్తున్నారని సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అమెరికా మీడియా కథనాలు వెల్లడించాయి. ఇరాన్‌పై భారీ స్థాయిలో దాడులు చేపడతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గతవారం హెచ్చరించిన సంగతి తెలిసిందే. అయితే, సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ జోక్యంతో భీకర దాడుల నుంచి ట్రంప్ వెనక్కి తగ్గారు. కాగా.. అధ్యక్షుడి హెచ్చరికల కంటే ముందే అమెరికా సెంట్రల్ కమాండ్ తమ బలగాలకు ఈ-మెయిల్ పంపించినట్లు తెలుస్తోంది. ఇరాన్‌ను తిరిగి చర్చలకు తీసుకురావడమే లక్ష్యంగా అమెరికా కొన్ని వారాలుగా నిరంతర వైమానిక దాడులు చేస్తూనే ఉంది. అయినప్పటికీ ఒప్పందం కుదిరే సూచనలు కనిపించకపోవడంతో.. టెహ్రాన్‌ను శిక్షించడంపై అగ్రరాజ్యం ఇప్పుడు దృష్టి సారించినట్లు సమాచారం. ఒప్పందంపై తుది నిర్ణయానికి రావడానికి ఇరాన్‌కు 'చివరి అవకాశం' ఇచ్చామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో చేపట్టిన దాడులకంటే తీవ్రంగా ఇరాన్‌పై విరుచుకుపడడానికి తమ దళాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. కానీ యుద్ధం ముగింపునకు దౌత్య మార్గాలు అనుసరించాలని ఇరాన్‌తో సహా సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్ చేసిన అభ్యర్థనల మేరకు సైనిక దాడిని నిలిపివేశామన్నారు. ప్రస్తుతం ఇరుదేశాల ప్రతినిధుల మధ్య సంప్రదింపులు కొనసాగుతున్నాయన్నారు. ఈ అవకాశాన్ని వారు వినియోగించుకోకపోతే ఇక టెహ్రాన్‌ను వదిలే సమస్యే లేదన్నారు. మరోవైపు మంగళవారం తెల్లవారుజామున కువైట్, ఇరాక్‌లోని అమెరికా స్థావరాలపై ఐఆర్‌జీసీ డ్రోన్ దాడులు చేపట్టింది.

# మీ భర్తదే పెత్తనమా - ఇలా చేయాలంటున్న నిపుణులు!




భార్యాభర్తల్లో ఇద్దరూ సమానమే. కానీ, కొంతమంది భర్తలు తమ భార్యలపై అన్ని విషయాల్లోనూ ఆధిపత్యం ప్రదర్శిస్తుంటారు. ఇలాంటి వారిని~ూశ్రీజూష్ట్రు ఎబంఖ్మిఅస అని అంటారు. అయితే, ఇలాంటి వాళ్లతో గొడవకు దిగకుండా, అదే సమయంలో ఆత్మ గౌరవాన్ని కోల్పోకుండా సమస్యను పరిష్కరించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మరి, అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం!నచ్చజెప్పండి : దంపతుల మధ్య ఏ గొడవ ఉన్నా కలిసి కూర్చొని మాట్లాడుకుంటే పరిష్కారమవుతుందట. ఆధిపత్యం ప్రదర్శించే భర్త విషయంలోనూ ఇది వర్తిస్తుందంటున్నారు నిపుణులు. అయితే, ఎదుటి వ్యక్తి కోపంలో ఉన్నప్పుడు ఏం చెప్పినా వారికి అర్థం కాదని చెబుతున్నారు. అందుకే, తను కాస్త ప్రశాంతంగా ఒకచోట కూర్చున్నప్పుడు వెళ్లి.. తన ప్రవర్తన వల్ల మీరు ఎంత ఇబ్బంది పడుతున్నారో విడమరిచి చెప్పాలని సూచిస్తున్నారు. మీ ఇద్దరి మధ్య జరిగే గొడవల వల్ల ఇటు మీరు, అటు పిల్లలు ఎంతలా సతమతమవుతున్నారో వాళ్లకు నచ్చజెప్పే ప్రయత్నం చేయాలని సూచిస్తున్నారు. అలాగే, వారు అలా ప్రవర్తించడానికి గల కారణాలేంటో కూడా ప్రేమ పూర్వకంగానే అడిగి తెలుసుకోవాలని చెబుతున్నారు. ఇలా ఇద్దరి మధ్య జరిగే సానుకూల చర్చ నెమ్మదిగానైనా మీ భాగస్వామిలో మార్పు తీసుకొచ్చే అవకాశం ఉందంటున్నారు.రాత్రి పడుకునే ముందు ఇలా చేస్తే – ముఖం అందంగా మెరిసిపోతుందట!

ఆధారపడద్దు : ఆర్థిక స్వేచ్ఛ ఉన్న మహిళల కంటే.. వ్యక్తిగతంగా, ఆర్థికంగా తమపై ఆధారపడే భార్యల విషయంలోనే చాలా మంది భర్తలు ఆధిపత్యం ప్రదర్శించాలని చూస్తుంటారు. ఈ క్రమంలో తమ భార్యలను తక్కువ చేసి మాట్లాడటం, చూడటం లాంటివి చేస్తుంటారు. వాళ్ల అభిప్రాయాలను, నిర్ణయాలను ఏ మాత్రం లెక్క చేయారు. ఇలాంటి భర్తలతో వేగలేక, తాము పడుతోన్న బాధను ఎవరితో చెప్పుకోలేక లోలోపలే కుమిలిపోతుంటారు చాలా మంది. ఇలాంటప్పుడు.. మీలో ప్రతిభ ఉంటే, మిమ్మల్ని మీరు నిరూపించుకోగలరన్న నమ్మకం ఉంటే ఎవరికీ తలవంచాల్సిన అవసరం లేదని నిపుణులు సూచిస్తున్నారు. మీ చదువు, ట్యాలెంట్?కి తగ్గ ఉద్యోగం వెతుక్కునే ప్రయత్నం చేయమంటున్నారు. ఇందుకు మీ భర్త అడ్డుపడినట్లయితే.. ఇద్దరి సంపాదన ఉంటే అది కుటుంబానికే మంచిదని సానుకూలంగా మాట్లాడే ప్రయత్నం చేయాలని సలహా ఇస్తున్నారు. ఇలా మీ కాళ్ల మీద మీరు నిలబడగలిగితే ఆత్మ విశ్వాసం, ఆత్మ గౌరవం రెట్టింపవుతాయని పేర్కొంటున్నారు. ఇది పరోక్షంగా అనుబంధానికి మేలు చేస్తుందని తెలియజేస్తున్నారు.ఆఖరి ప్రయత్నంగా : ఎదుటివారు తమను తక్కువ చేసి చూస్తున్నారంటే.. కోపం కట్టలు తెంచుకోవడం సహజం. అలాగని, ఎంత ప్రయత్నించినా వాళు మారట్లేదని.. మీరూ వాళ్లలాగే గట్టిగా అరవడం, గొడవకు దిగడం అంత మంచిది కాదంటున్నారు నిపుణులు. ఇలా చేస్తే సమస్య పరిష్కారమవకపోగా.. మరింత జఠిలమవుతుందని చెబుతున్నారు. కాబట్టి, ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోతే.. ఆఖరి ప్రయత్నంగా ఇద్దరూ కలిసి మానసిక నిపుణుల దగ్గరికి కౌన్సెలింగ్?కి వెళ్లాలని సూచిస్తున్నారు. తద్వారా, మీ భర్త ప్రవర్తనకు గల కారణాలేంటో తెలుసుకొని, వాళ్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వడం, ఇద్దరితో మరోసారి మాట్లాడడం వంటివి చేస్తారట. దీనివల్ల కొంత వరకు ఫలితం ఉండచ్చని చెబుతున్నారు.

# మైసిగండి మైసమ్మ తల్లి- ఆషాఢ మాసం బోనాల విశిష్టత ఇదే!






ఆషాఢంలో తెలంగాణ ప్రాంతంలో బోనాలు అతి పెద్ద జాతర. ఈ నెలరోజులపాటు తెలంగాణ ప్రాంతంలోని అమ్మవారి ఆలయాలన్నీ ఉత్సవ శోభతో ప్రకాశిస్తుంటాయి. బోనాలు సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో ప్రతి ఆదివారం, సోమవారం, మంగళవారం ప్రత్యేక పూజలు జరుగుతాయి. ఈ సందర్భంగా తెలంగాణాలో అతి ప్రాచీనమైన మైసిగండి మైసమ్మ తల్లి ఆలయ విశేషాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

**మైసిగండి ఎక్కడుంది?**

మహబూబ్ నగర్ జిల్లాలోని ఆమనగల్లు మండలం, హైదరాబాద్ నుంచి కర్నూలు వెళ్లే జాతీయరహదారికి సమీపంలో మైసిగండి అనే ప్రాంతంలో మైసమ్మ తల్లి వెలసి ఉంది. అమ్మవారు ఇక్కడ ఉన్న ఒక వేప చెట్టు కింద బురుజు గోడలో స్వయంభువుగా వెలిసిందని ఆలయ స్థల పురాణం ద్వారా తెలుస్తోంది. ఈ మైసమ్మ ఇక్కడ గ్రామదేవతగా పూజలందుకుంటోంది.

**ఆరాధ్య దేవత**

మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాల ప్రజలకు ఈ మైసమ్మ తల్లి ఆరాధ్య దేవత. కల్వకుర్తి, అచ్చంపేట, శ్రీశైలం వైపు వెళ్లే బస్సులన్నీ ఈ అమ్మవారి ఆలయం దగ్గర కొంత సమయం తప్పకుండా ఆగుతాయి. భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్న ఈ మైసమ్మ తల్లి సృష్టి స్థితి లయకారిణి అయిన కాళికాదేవి స్వరూపంతో పూజలందుకోవడం విశేషం. ఈ మైసమ్మ తల్లిని దర్శించి, అర్చించిన వారు జీవితంలో సుఖసంతోషాలతో, సకల సౌభాగ్యాలతో వర్ధిల్లుతారని విశ్వాసం.

**విగ్రహ ప్రతిష్టాపన**

మైసమ్మ విగ్రహం ప్రతిష్టించక ముందు ఇక్కడ ఒక చిన్న శిలా విగ్రహం మాత్రమే ఉండేది. కొంతకాలం తర్వాత ఒక భక్తుని సహకారంతో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించినట్లుగా తెలుస్తోంది. కోట బురుజులో అమ్మవారు వెలసినప్పుడు కేవలం చిన్న శిలలో అమ్మవారి ఆకృతి మాత్రమే గోచరించేది. కాలక్రమేణా ఆలయ నిర్మాణం తర్వాత ఆలయం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు రావడం మొదలైంది.

**ఇతర ఆలయాలు**

మైసమ్మ ఆలయానికి అరకిలోమీటరు దూరంలో శివాలయం, రామాలయం, అన్నపూర్ణేశ్వరి ఆలయాలు కూడా ఉన్నాయి. ఈ దేవాలయాలు అతి ప్రాచీనమైనవి. పూర్వం గోల్కొండను పరిపాలించిన తానీషా వద్ద పనిచేసిన అక్కన్న, మాదన్నలు ఈ ఆలయాలను నిర్మించినట్లుగా ఆలయంలోని శాసనాల ద్వారా తెలుస్తోంది. ఈ ఆలయాలకు సమీపంలోనే ఒక కోనేరు కూడా ఉంది. ఈ ప్రాంతాలకు ఎదురుగానే మైసమ్మ వెలసి ఉన్నందున ఈ ప్రాంతానికి మైసంగండి అనే పేరు వచ్చింది.

**మత సామరస్యానికి నిదర్శనం**

మైసిగండిలో వెలసిన మైసమ్మను కులమతాలకు అతీతంగా అందరూ పూజించడం మత సామరస్యానికి నిదర్శనంగా నిలుస్తుంది. ఇటు హిందువులతో పాటు, ముస్లిం, క్రైస్తవులు కూడా అమ్మవారిని దర్శించి పూజించి తమ అభీష్టాలను నెరవేర్చుకుంటూ ఉంటారు.

**పూజోత్సవాలు**

ప్రతి ఆది, మంగళ, గురు వారాల్లో గండి మైసమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతాయి. జాతీయ రహదారి సమీపంలో ఉన్నందున ప్రతిరోజూ అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య అధికంగానే ఉంటుంది. ఇక ప్రతి ఏటా ఆషాఢ మాసంలో బోనాలు జాతర ఘనంగా జరుగుతుంది. ఈ సందర్భంగా చుట్టపక్కల అనేక గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు. మైసిగండి ప్రాంతం ఆంధ్ర తెలంగాణ సరిహద్దులో ఉన్నందున ఇరు రాష్ట్రాల ప్రజలకు అమ్మవారు ఆరాధ్య దేవతగా విరాజిల్లుతోంది.

**ఉత్సవాలతో కళకళలాడే ఆలయాలు**

ఇక్కడ వెలసి ఉన్న శివాలయం, రామాలయం, అన్నపూర్ణేశ్వరి ఆలయాలలో కూడా నిత్యపూజలతో పాటు విశేష పూజలు కూడా జరుగుతాయి. శివాలయంలో మహాశివరాత్రికి బ్రహ్మోత్సవాలు, రామాలయంలో శ్రీరామ నవమి, హనుమజ్జయంతి పండుగలు విశేషంగా జరుగుతాయి. అలాగే అన్నపూర్ణేశ్వరి ఆలయంలో దసరా నవరాత్రులు వైభవంగా జరుగుతాయి. ఈ ఆషాఢ మాసంలో మనం అమ్మవారి ఆశీర్వాదాన్ని పొందుదాం. సుఖ సంతోషాలతో వర్ధిల్లుదాం. ఓం శ్రీ మాత్రే నమః

ముఖ్య గమనిక : పైన తెలిపిన వ్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది గా మీ వ్యక్తిగత విషయం.

# భారత కార్ మార్కెట్లో సరికొత్త చరిత్ర- 4.7 లక్షల విక్రయాలు





భారత ఆటోమొబైల్ రంగానికి జులై నెల బాగా కలిసొచ్చింది. దేశీయ ప్యాసింజర్ వాహనాల మార్కెట్ జులై 2026లో రికార్డు స్థాయి అమ్మకాలతో దూసుకెళ్లింది. ఈ ఒక్క నెలలోనే ఏకంగా 4.7 లక్షల యూనిట్ల విక్రయాలు నమోదయ్యాయి. గతేడాది ఇదే నెలలోని 3.5 లక్షల యూనిట్ల అమ్మకాలతో పోలిస్తే.. ఇది సుమారు 34 శాతం వార్షిక వృద్ధిని (శ్రీ) సూచిస్తోంది. ముఖ్యంగా ఎస్‌యూవీ (రాఖఎ) మోడళ్లకు ఉన్న ఆదరణ, ఎలక్ట్రిక్ వాహనాల (జుఎ) డిమాండ్ వేగంగా పెరగడం ఈ భారీ వృద్ధికి ప్రధాన కారణాలుగా నిలిచాయి.

దేశంలో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి ఈ నెలలో సరికొత్త చరిత్ర సృష్టించింది. జులై నెలలో మారుతి సుజుకి ఏకంగా 2 లక్షలకు పైగా కార్లను విక్రయించి, కంపెనీ చరిత్రలోనే అత్యధిక నెలవారీ దేశీయ అమ్మకాలను నమోదు చేసింది.మారుతి సుజుకి ఇండియా మార్కెటింగ్ ఒ సేల్స్ విభాగం సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ తెలిపిన వివరాల ప్రకారం, గతేడాది జులైలో 1,80,526 యూనిట్లు అమ్ముడవగా, ఈ నెలలో కంపెనీ మొత్తం 2,41,421 యూనిట్లను విక్రయించింది. దీనిబట్టి మారుతి సుజుకి ఏకంగా 33 శాతం వార్షిక వృద్ధిని సాధించి మార్కెట్లో తన నంబర్ వన్ స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది.మారుతి సుజుకితో పాటు దేశంలోని ఇతర ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజాలు కూడా జులై 2026లో రికార్డు స్థాయి విక్రయాలతో సరికొత్త రికార్డులు సృష్టించాయి. హ్యుందాయ్, టాటా మోటార్స్, కియా, నిస్సాన్ కంపెనీల అమ్మకాల వివరాలు ఇలా ఉన్నాయి:హ్యుందాయ్ ఇండియా సంస్థ భారత్‌లో అడుగుపెట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ఏ ఒక్క నెలలోనూ సాధించని విధంగా.. ఈ జులైలో అత్యధిక నెలవారీ అమ్మకాలను నమోదు చేసింది. మొత్తం 75,360 కంటే ఎక్కువ యూనిట్లను విక్రయించి, గతేడాదితో పోలిస్తే 25.4 శాతం వృద్ధిని సాధించింది.దేశీయ అమ్మకాలు: 23.3 శాతం పెరిగి 54,210 యూనిట్లకు చేరాయి. (హ్యుందాయ్ చరిత్రలోనే ఇది బెస్ట్ జులై సేల్స్). ఎగుమతులు: 31.4 శాతం పెరిగి 21,150 యూనిట్లకు చేరాయి. (గడిచిన 100 నెలల్లో ఇవే అత్యధిక ఎగుమతులు).

టాటా మోటార్స్: 59 శాతం భారీ వృద్ధిటాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ (ఎవీూఎ) జులైలో దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో కలిపి మొత్తం 63,760 యూనిట్ల అమ్మకాలను నమోదు చేసింది. గతేడాది ఇదే నెలలో నమోదైన 40,175 యూనిట్లతో పోలిస్తే ఇది 59 శాతం వృద్ధిని సూచిస్తుంది. టాటా మోటార్స్ దేశీయ ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు 58 శాతం పెరిగి 62,611 యూనిట్లుగా నమోదయ్యాయి.

కియా ఇండియా: బెస్ట్ జులై హోల్‌సేల్ పెర్ఫార్మెన్స్‌కియా ఇండియా కూడా జులై నెలలో తన అత్యుత్తమ హోల్‌సేల్ (డీలర్లకు సరఫరా) పనితీరును నమోదు చేసింది. కంపెనీ సరఫరా చేసిన వాహనాల సంఖ్య ఏడాది ప్రాతిపదికన 27.4 శాతం పెరిగి 28,200 యూనిట్లకు చేరింది. అదే సమయంలో, జనవరి-జులై కాలంలో మొత్తం సరఫరా 1,91,949 యూనిట్లుగా నమోదైంది. ఇది గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 16.8 శాతం ఎక్కువ.నిస్సాన్ మోటార్ ఇండియా: దేశీయ మార్కెట్లో 218 శాతం జంప్‌నిస్సాన్ ఇండియా కూడా జులైలో రికార్డు స్థాయి హోల్‌సేల్ అమ్మకాలను సాధించింది. కంపెనీ మొత్తం 9,339 యూనిట్ల వాహనాలను సరఫరా చేసింది. ముఖ్యంగా దేశీయ హోల్‌సేల్ అమ్మకాలు ఏడాది ప్రాతిపదికన 218 శాతం పెరిగి 4,518 యూనిట్లకు చేరగా, ఎగుమతులు 4,821 యూనిట్లుగా నమోదయ్యాయి.

# చదువుల్లో అద్భుతంగా రాణించాలా? పరిహారాలు చేసుకోండిలా!



నవగ్రహాలలో గురు గ్రహానికి మంచి స్థానముంది. విద్యార్థులు చదువులో చురుగ్గా ఉండాలన్నా, పోటీ పరీక్షల్లో విజయం సాధించాలన్నా గురువు అనుగ్రహం ఎంతో ముఖ్యం. గురువు అనుగ్రహం లేకుంటే మందబుద్ధిగా ఉండడం, పరీక్షల్లో తరచుగా వైఫల్యం చెందడం వంటివి జరుగుతుంటాయి. విద్యార్థులు చదువులో ఉన్నత స్థితికి చేరుకోవడానికి గురువు బోధనలు పాటించడం ఎంత ముఖ్యమో నవగ్రహాలలో గురువు అనుగ్రహం కూడా అంతే అవసరం. ఈ కథనంలో విద్యార్థులు గురువు అనుగ్రహం కోసం పాటించాల్సిన పరిహారాలు గురించి తెలుసుకుందాం.

**గురువారం పరిహారం!**

పిల్లల బంగారు భవిష్యత్తు, విద్యాభివృద్ధి కోసం పిల్లలతో తరచుగా గణపతి, సరస్వతి పూజ సూర్యనమస్కారం, హయగ్రీవ స్తోత్రాలు చేయిస్తుండాలి. విద్యార్థుల ఉజ్వలమైన భవిష్యత్తు, వారు క్రమశిక్షణతో మంచి అలవాట్లు, ఆలోచనలతో కూడిన విద్యార్జన సాధన కోసం శివ స్వరూపమైన దక్షిణామూర్తిని ఆరాధించాలి. ఇది మాత్రమే కాకుండా గురు గ్రహ అనుకూలత కోసం శాస్త్రంలో సూచించిన మరికొన్ని పరిహారాలు కూడా తెలుసుకుందాం.

**దక్షిణామూర్తి ఆరాధన**

గురు గ్రహ అనుకూలత కోసం గురువారం రోజు శివాలయంలో ప్రతిష్ఠించి ఉన్న దక్షిణామూర్తి ఎదురుగా పసుపు రంగు వస్త్రం పైన బియ్యం పిండితో తయారు చేసిన రెండు చిన్న ప్రమిదలు పెట్టి, ఒక్కో ప్రమిదలో రెండేసి వత్తులు వేసి, నేతి దీపాలు పెట్టాలి. దీపాలను కుంకుమతో అలంకరించాలి. పిదప భక్తి శ్రద్ధలతో దక్షిణామూర్తి స్తోత్రం పారాయణ చేయాలి. నానబెట్టిన పచ్చి శనగలు దండగా కూర్చి, ఆ మాలను దక్షిణామూర్తికి వేయాలి. ఇలా 9 గురువారాలు చేస్తే కోరుకున్న చోట చదువుకునే అవకాశాలతో పాటు విదేశాలలో విద్యార్జనకు ఉన్న ఆటంకాలు కూడా తొలగుతాయి.

**కొబ్బరి చిప్పలో దీపారాధన**

దత్తాత్రేయ స్వామి ఆలయంలో కొబ్బరికాయ కొట్టి రెండు చిప్పల్లో కొబ్బరి నూనె పోసి వత్తులు వేసి దీపారాధన చేయాలి. ఈ పరిహారం కూడా 9 గురువారాలు పాటించాలి. ఇలా చేయడం వల్ల విద్యార్థుల్లో తెలివితేటలు పెరిగి చదువులో చురుగ్గా ఉంటారు.

**గోపూజ**

గురువారానికి లక్ష్మీవారమని కూడా పేరుంది. గురువారం శ్రీ మహాలక్ష్మి స్వరూపమైన గోవును పసుపు కుంకుమలతో పూజించి, నానబెట్టిన శనగలు తినిపించడం వల్ల ఉన్నత విద్యావకాశాలు మెరుగు పడతాయి. చదువు పూర్తి చేసుకుని ఉద్యోగాన్వేషణలో ఉన్నవారికి మంచి ఉద్యోగం లభిస్తుంది. అలాగే గోమాతకు గురువారం రోజు చపాతీలు తినిపించడం వలన ఆకస్మిక గండాలు తొలగుతాయి. గురువారం గోమాతకు గ్రాసం తినిపిస్తే లక్ష్మీ కటాక్షం కలుగుతుంది.

బలహీనంగా ఉన్నప్పుడు ప్రసిద్ధ గురు క్షేత్రాలను సందర్శించడం ఉత్తమ ఫలితాలనిస్తుంది. మన దేశంలో రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లోని బృహస్పతి ధామ్ ప్రసిద్ధ గురు క్షేత్రం. అలాగే కుయివారం శ్రీ మహాలక్ష్మి స్వరూపమైన గోవును పసుపు కుంకుమలతో పూజించి, నానబెట్టిన శనగలు తినిపించడం వల్ల ఉన్నత విద్యావకాశాలు మెరుగు పడతాయి. చదువు పూర్తి చేసుకుని ఉద్యోగాన్వేషణలో ఉన్నవారికి మంచి ఉద్యోగం లభిస్తుంది. అలాగే గోమాతకు గురువారం రోజు చపాతీలు తినిపించడం వలన ఆకస్మిక గండాలు తొలగుతాయి. గురువారం గోమాతకు గ్రాసం తినిపిస్తే లక్ష్మీ కటాక్షం కలుగుతుంది.

బలహీనంగా భకోణంలో గురుస్థానం ప్రత్యేకమైన గురు క్షేత్రం. అలాగే వారణాసిలోని

ద

**దత్త పారాయణ**

దత్తాత్రేయ స్వామి జీవిత చరిత్ర అయిన గురు చరిత్ర ప్రతి గురువారం పారాయణ చేయడం వల్ల గురుగ్రహ అనుగ్రహం పరిపూర్ణంగా లభిస్తుంది. కుటుంబంలో ఆర్థిక సమస్యలు తొలగి పోతాయి.

**గురు క్షేత్రాల దర్శనం**

జాతకంలో గురు గ్రహం బలహీనంగా ఉన్నప్పుడు ప్రసిద్ధ గురు క్షేత్రాలను సందర్శించడం ఉత్తమ ఫలితాలనిస్తుంది. మన దేశంలో రాజస్థాన్ రాష్ట్రంలోని జైపుర్‌లోని బృహస్పతి ధామ్ ప్రసిద్ధ గురు క్షేత్రం. అలాగే కుంభకోణంలో గురుస్థానం ప్రత్యేకమైన గురు క్షేత్రం. అలాగే వారణాసిలోని దశాశ్వమేధ ఘాట్ వెళ్లే మార్గంలో ఉన్న శ్రీ బృహస్పతి మహాదేవ్ మందిర్ కూడా ప్రసిద్ధ గురు క్షేత్రంగా విరాజిల్లుతోంది. ఉత్తరాఖండ్ రాష్ట్రం నైనిటాల్ జిల్లా సమీపంలో సముద్ర మట్టానికి సుమారు 8000 అడుగుల ఎత్తులో ఉన్న దేవ గురు పర్వతంపై వెలసిన బృహస్పతి ఆలయం కూడా ప్రసిద్ధ గురు క్షేత్రంగా విరాజిల్లుతోంది. ఇవి కాకుండా ప్రముఖ దత్త క్షేత్రమైన గాణగాపూర్, కురుపురం, శిర్డీ సాయినాథుని ఆలయం కూడా ప్రసిద్ధి చెందిన గురు క్షేత్రాలు. ఈ ఆలయాలను దర్శించడం వల్ల గురు గ్రహ దోషాలు తొలగి సకల శుభాలు చేకూరుతాయి.

**పిల్లలు మాట వినడం లేదా!**

ఒకవేళ పిల్లలు ఇలాంటి పూజలు చేయడానికి ఇష్టపడని సందర్భాలలో పిల్లల తరపున వారి తల్లిదండ్రులు ఈ పూజలు చేయడానికి శాస్త్రం అనుమతిస్తుంది. కాబట్టి పిల్లలే పూజలు చేయాలని అనుకోకుండా వారి తరపున పెద్దలు కూడా ఈ పూజలు చేయడం వల్ల ఉత్తమ ఫలితాలు పొందవచ్చు.

విద్యార్థులకు చదువులో ఆటంకాలు తొలగించి వృత్తి పరమైన పురోగతి అందించే ఈ గురువారం పరిహారాలు పాటించడం వల్ల విద్యాపరమైన అభివృద్ధితో పాటు సకల శుభాలు పొందవచ్చు.

**ఓం శ్రీ గురుభ్యోనమః!**

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి.వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

# తుంగతుర్తి కాంగ్రెస్‌పై జగ్గారెడ్డి నివేదిక

- ఏడు పేజీల నివేదికను పీసీసీకి సమర్పణ
- వర్గపోరుపై క్షేత్రస్థాయిలో పది రోజుల పరిశీలన
- ఎమ్మెల్యేనే నియోజకవర్గానికి తొలి నాయకుడని వ్యాఖ్య
- ఉమ్మడి నల్లగొండ నేతల పాత్రపై ప్రస్తావన



హైదరాబాద్, ఆగస్టు 4 : సూర్యాపేట జిల్లా తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలు, వర్గపోరుపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, పార్టీ పరిశీలకుడు జగ్గారెడ్డి తన సమగ్ర నివేదికను సిద్ధం చేసి పీసీసీ అధ్య క్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు అందజేశారు. మొత్తం ఏడు పేజీలతో రూపొందించిన ఈ నివే దికను సీల్డ్ కవర్‌లో సమర్పించినట్లు తెలిపారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలపై గత పది రోజులుగా క్షేత్రస్థాయిలో పర్యటించి ఇరువర్గాల నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్ర తిని ధుల అభిప్రాయాలను సేకరించినట్లు జగ్గారెడ్డి వెల్లడించారు. అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం వాస్తవ పరిస్థితులను నివేదికలో పొందుపరిచినట్లు చెప్పారు.
నివేదిక రూపొందించే క్రమంలో వర్గ విభేదాలకు దారితీసిన కారణాలు, పార్టీ శ్రేణుల అభిప్రాయాలు, స్థానిక పరిస్థితులను క్షుణ్ణంగా అధ్యయనం చేసినట్లు తెలిపారు. పార్టీ బలోపే తానికి అవసరమైన సూచనలు కూడా నివేది కలో పొందుపరిచినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ, ఏ నియో జకవర్గంలోనైనా స్థానిక ఎమ్మెల్యేనే తొలి నాయకుడని, ఆ తర్వాతే ఎంపీ, మంత్రులకు ప్రాధాన్యత ఉంటుందని వ్యాఖ్యానించారు. అనం తరం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి పాత్ర ఉంటుందని పేర్కొన్నారు.
మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి సంబంధించిన వివాదాలు, ఇటీవల జరిగిన పరిణామాలను కూడా నివేదికలో ప్రస్తావించినట్లు తెలిపారు. పార్టీలో సమన్వ యం, క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయ ఁపడ్డారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కీలక నాయ కులుగా ఉన్నారని జగ్గారెడ్డి పేర్కొన్నారు. పార్టీ నాయకత్వం తగిన నిర్ణయాలు తీసుకుని విభేదా లను పరిష్కరించి సంస్థను మరింత బలోపేతం చేస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.


# రామప్ప ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన

- రూ.61.99 కోట్ల ప్రసాద్ పథకం పనులపై సమీక్ష
- నాణ్యతతో గడువులోపు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం
- మంత్రి సీతక్క, కలెక్టర్ హేమంత్ సంయుక్తంగా తనిఖీ
- భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనే లక్ష్యమని వెల్లడి



ములుగు, ఆగస్టు 4 : వెంకటాపూర్ మండలం పాలంపేటలోని ప్రపంచ వారసత్వ కట్టడం రామప్ప దేవాల యం వద్ద ప్రసాద్ పథకం కింద రూ.61.99 కోట్ల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పను లను రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క), జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదే వరావుతో కలిసి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిపై అధికా రులతో సమీక్ష నిర్వహించి, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో జరుగుతున్న మౌలిక వసతుల అభివృద్ధి పనులు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పర్యాటక అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలపై అధికారులు మంత్రికి వివరించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, పనుల అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చూడాలని మంత్రి సూచించారు.
రామప్ప దేవాలయం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన వారసత్వ కట్టడం కావడంతో అభివృద్ధి పనులు ఆలయ ప్రాచీనతకు ఎలాంటి భంగం కలగకుండా చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. వారసత్వ సంపదను పరిరక్షిస్తూ భక్తులు, పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా అన్ని పనులు కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ ప్రసాద్ పథకం కింద చేపడుతున్న అన్ని పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. నిర్ణయించిన గడువులోపు పనులు పూర్తయ్యేలా సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పనుల నాణ్యతపై రాజీ పడకుండా అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహి ంచాలని సూచించారు.రామప్ప ఆలయాన్ని సందర్శించే దేశ, విదేశీ పర్యాటకులకు మరింత మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని అధికారులు తెలిపారు. రహదారులు, పర్యాటక సౌకర్యాలు, ఇతర మౌలిక వసతులను బలోపేతం చేయడం ద్వారా ఆలయాన్ని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్ప ర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ భగవాన్‌రెడ్డి, పర్యాటక శాఖ డీఈ నటరాజ్, ఏఈ విజయ్, స్థానిక ప్రజా౹ పతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మధుమేహం ఉన్నవారికి వరం విటమిన్ డి.. సైంటిస్టుల అధ్యయనంలో వెల్లడి..




విటమిన్ డి శరీరానికి అత్యంత అవసరమైన పోషకాలలో ఒకటి. దీనిని సన్‌షైన్ విటమిన్ అని కూడా పిలుస్తారు. ఎముకల ఆరోగ్యంతోపాటు శరీరంలోని అనేక కీలక వ్యవస్థలు సక్రమంగా పనిచేయడానికి ఇది అవసరం. ఒక అధ్యయనం ప్రకారం విటమిన్ డి క్లోమగ్రంథి (ప్యాంక్రియాస్)లో ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసి, నిల్వ చేసి, విడుదల చేసే బీటా కణాల పనితీరును మెరుగుపరచడంలో సహాయపడే అవకాశం ఉందని పరిశోధకులు గుర్తించారు. దీంతో మధుమేహం చికిత్సలో విటమిన్ డి పాత్రపై కొత్త ఆశలు కనిపిస్తున్నాయి. పరిశోధకుల ప్రకారం శరీరంలో విటమిన్ డి స్థాయిలు ఎక్కువగా ఉండటం వల్ల మధుమేహం వచ్చే ప్రమాదం తక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. విటమిన్ డి రిసెప్టర్‌ను చురుకుగా చేయడం ద్వారా శరీరంలోని వాపులను తగ్గించే జన్యువుల పనితీరు మెరుగుపడి, ఒత్తిడిలో కూడా బీటా కణాలు మనుగడ సాగించేందుకు తోడ్పడతాయని అధ్యయనం పేర్కొంది. అయితే కేవలం విటమిన్ డి ఒక్కటే బీటా కణాలను పూర్తిగా రక్షించలేదని కూడా పరిశోధకులు వెల్లడించారు.సూర్యకాంతి తగలాలి..శరీరంలో విటమిన్ డి లోపం రాకుండా ఉండాలంటే ప్రతిరోజూ కొంతసేపు సూర్యరశ్మిలో గడపడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. రోజుకు కనీసం ఐదు నిమిషాలపాటు ఎండలో ఉండటం వల్ల చర్మంలో ఉండే కొలెస్ట్రాల్‌పై సూర్యుని అతినీలలోహిత కిరణాలు ప్రభావం చూపి విటమిన్ డిగా మారుతుంది. అలాగే వారానికి కనీసం మూడు రోజులైనా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య సూర్యరశ్మి శరీరానికి అందితే విటమిన్ డి స్థాయిలు పెరగడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఆహారంలో విటమిన్ డి సమృద్ధిగా ఉండే పదార్థాలను చేర్చుకోవడం కూడా అవసరం. ముఖ్యంగా పుట్టగొడుగులు, గుడ్డు పచ్చసొన, కాడ్ లివర్ ఆయిల్, కొవ్వు ఎక్కువగా ఉండే చేపలు వంటి ఆహారాల్లో విటమిన్ డి లభిస్తుంది.
ఈ ఆహారాలను తీసుకుంటే..
సోయా పాలు, మజ్జిగ వంటి పానీయాలను రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం కూడా విటమిన్ డి అందించడంలో సహాయపడుతుందని పేర్కొన్నారు. అయితే ఇతర విటమిన్ డి ఫోర్టిఫైడ్ పానీయాలను తీసుకునే ముందు పోషకాహార నిపుణుల సలహా తీసుకోవడం మంచిది. విటమిన్ డి లోపం ఉన్నట్లు వైద్య పరీక్షల్లో నిర్ధారణ అయినప్పుడు మాత్రమే వైద్యుల పర్యవేక్షణలో విటమిన్ డి సప్లిమెంట్లను తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. స్వయంగా మందులు వాడటం ఆరోగ్యానికి హానికరమవుతుందని హెచ్చరిస్తున్నారు. విటమిన్ డి ఎక్కువగా కాడ్ లివర్ ఫిష్ ఆయిల్, ఎండబెట్టిన షిటాకే పుట్టగొడుగులు, గుడ్లు, పూర్తి పాలతో తయారుచేసిన మజ్జిగ, చెడార్ లేదా లభిస్తుంది.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రికార్డు ప్రవేశాలు

- మొదటి సంవత్సరం చేరికలు 85 వేల మార్కు దాటాయి
- ప్రభుత్వ విద్యపై పెరిగిన విద్యార్థులు, తల్లిదండ్రుల విశ్వాసం
- నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ అవకాశాలపై ప్రత్యేక దృష్టి
- మౌలిక వసతులు, డిజిటల్ విద్యకు భారీ నిధులు



హైదరాబాద్, ఆగస్టు 4 : తెలంగాణలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2026--27 విద్యా సంవత్సరానికి రికార్డు స్థాయిలో విద్యార్థుల ప్రవేశాలు నమోదయ్యాయి. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 85,453 మంది విద్యార్థులు చేరగా, గత విద్యా సంవత్సరంతో పోలిస్తే సుమారు 14 శాతం పెరుగుదల నమోదైంది. ప్రస్తుతం మొదటి, రెండో సంవత్సరం కలిపి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొత్తం 1,64,730 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు పెరగడం ప్రభుత్వ విద్యా వ్యవస్థపై విద్యార్థులు, తల్లిదండ్రుల విశ్వాసానికి నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం నాణ్యమైన, సమగ్ర, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన విద్య అందించేందుకు విద్యా సంస్కరణలు, ఆధునిక మౌలిక వసతులు, డిజిటల్ బోధన, విద్యార్థి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.
పరిశ్రమలతో భాగస్వామ్యాల ద్వారా విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రముఖ సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాల ద్వారా నైపుణ్యాభివృద్ధి, ఇంటర్న్‌షిప్‌లు, శిక్షణ, క్యాంపస్ నియామకాలకు అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే వివిధ సంస్థల భాగస్వామ్యంతో రెండు వేలకుపైగా ఉద్యోగాలు, అప్రెంటిస్‌షిప్ అవకాశాలు లభించగా, మరో సంస్థ ద్వారా 300 మందికి పైగా ఇంటర్మీడియట్ అర్హత కలిగిన యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం పాఠ్యాంశాల్లో మార్పులు చేపట్టినట్లు అధికారులు వివరించారు. మొదటి సంవత్సరం పాఠ్యాంశాలను జాతీయ విద్యా ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించడంతో పాటు పాత అంశాలను తొలగించి నవీకరించిన పాఠ్యాంశాలను ప్రవేశపెట్టారు. క్యూ ఆర్ కోడ్‌లతో కూడిన పాఠ్యపుస్తకాలు అందుబాటులోకి తీసుకురావడంతో విద్యార్థులు మొబైల్ ఫోన్ల ద్వారా వీడియో పాఠాలు, డిజిటల్ అధ్యయన సామగ్రిని వినియోగించుకునే అవకాశం కల్పించారు.
సమగ్ర శిక్ష పథకం కింద ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించారు. ఆధునిక మరుగుదొడ్లు, క్రీడా సదుపాయాలు, పర్యావరణ క్లబ్‌లు, కంప్యూటర్ గదులు, గ్రంథాలయాల అభివృద్ధి, ప్రయోగశాలల కోసం కోట్ల రూపాయలు విడుదల చేశారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, పోషకాహార అల్పాహారం, మధ్యాహ్న భోజనం వంటి సంక్షేమ పథకాలు కూడా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పెరుగుతున్న ప్రవేశాలు విద్యా రంగంలో చోటుచేసుకున్న సంస్కరణలకు నిదర్శనమని అధికారులు పేర్కొన్నారు. నాణ్యమైన బోధన, డిజిటల్ విద్య, ఆధునిక మౌలిక వసతులు, పరిశ్రమలతో అనుసంధానం, ఉద్యోగ అవకాశాలు, సంక్షేమ చర్యలతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు విద్యార్థులకు ప్రాధాన్య విద్యాసంస్థలుగా మారుతున్నాయని వెల్లడించారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి

- నూతన భవనాలను ప్రారంభించిన మంత్రి సీతక్క
- కష్టపడి చదివి రాష్ట్రంలో తొలి స్థానంలో నిలవాలని పిలుపు
- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యపై దృష్టి
- రామప్ప ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి

ములుగు, ఆగస్టు 4 : విద్యార్థులు ఇష్టంతో, కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, పోటీ ప్రపంచంలో ప్రతిభ చాటాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. మంగళవారం వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్ గ్రామంలో సమగ్ర శిక్ష పథకం కింద రూ.2.30 కోట్ల వ్యయంతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నూతన భవనం, అదనపు తరగతి గదులు, ప్రయోగశాల భవనాలను జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మంత్రి సీతక్క మాట్లాడుతూ, ప్రతి విద్యార్థికి కంప్యూటర్ విద్యపై అవగాహన ఎంతో అవసరమని అన్నారు. పట్టుదలతో చదివితే సాధించలేనిది ఏదీ లేదని పేర్కొన్నారు. గొప్ప విద్యను అభ్యసించి సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని, విద్యతో పాటు సంస్కారం, క్రమశిక్షణ, ధ్యానం కూడా జీవితంలో ముఖ్యమని సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ప్రైవేటు విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు మంత్రి సూచించారు. ఆధునిక బోధనా పద్ధతులను అనుసరించి విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. రానున్న పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలోనే ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. ప్రభుత్వం విద్యారంగానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, పాఠశాలల్లో విద్యాబోధన, మధ్యాహ్న భోజన నాణ్యతను పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు వెల్లడించారు.
మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ చాటుతున్నారని, విద్యార్థినులు ఆత్మవిశ్వాసంతో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణలో

# ఈ నెల 6 వ తేదీన పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్స్ మరియు ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలి

- విద్యార్థుల మహా ధర్నా విజయంతం చేయాలి ఎస్ఎఫ్ఐ
- విద్యార్థుల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ విద్య పరిరక్షణే ధ్యేయం ఎస్ఎఫ్ఐ
- షాద్ నగర్ డివిజన్ కార్యదర్శి వడ్ల శ్రీకాంత్
- షాద్ నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మరియు విజ్ఞాన్ డిగ్రీ విద్యార్థులతో సమావేశం







షాద్ నగర్ ఆగస్ట్04:విద్యార్థుల సమస్యల పరిష్కారం, విద్యా హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ విద్య బలోపేతమే లక్ష్యంగా ఈనెల 6న హైదరాబాద్లోని ఇందిరా పార్క్ (ధర్నా చౌక్) వద్ద నిర్వహించనున్న 'ఛలో హైదరాబాద్' కార్యక్రమాన్ని మేరకు మంగళవారం షాద్ నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ షాద్ నగర్ డివిజన్ కార్యదర్శి వడ్ల శ్రీకాంత్ విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ పిలుపునిచ్చింది.శ్రీకాంత్ మాట్లాడుతూ.. విద్యా రంగంలో ఎదురవుతున్న సమస్యలపై పోరాడేందుకు, దుకు ప్రభుత్వ విద్యను కాపాడుకు నేందుకు 'ఛలో హైదరాబాద్' కార్యక్రమాన్ని తలపెట్టినట్టు తెలిపారు. విద్యార్థులందరూ ఐక్యంగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. విద్యార్థుల హక్కుల సాధన కోసం కార్యక్రమానికి షాద్ నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్వహించే ఈ పోరాటాన్ని జయప్రదం చేయడం ప్రతి విద్యార్థి బాధ్యత అని పేర్కొన్నారు. 6న జరిగే ధర్నా చౌక్ విద్యార్థులతో పాటు పరిసర ప్రాంతాల కళాశాలల విద్యా ర్థులు భారీ సంఖ్యలో తరలిరావాలని వారు పిలుపు నిచ్చారు.ఈ కార్యక్ర మంలో ఎస్ఎఫ్ఐ టౌన్ ఉపాధ్యక్షులు అదిల్, చరణ్, ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, రాంచరణ్, తరుణ్,రాజేష్, శ్రీనేతన్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# వీధి వ్యాపారుల చట్టం 2014ను కాలరాస్తున్నది అధికారులు, ప్రజాప్రతినిధులే

- కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్
- ఇప్పటికైనా వీధి వ్యాపారుల చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్
- వ్యాపారులను వేధించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి
- త్వరలో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామని వెల్లడి



షాద్ నగర్, ఆగస్ట్ 04:ప్రజలకు నిత్యావసర వస్తువులు తొలుత అందుబాటులో ఉంచేది వీధి వ్యాపారులేనని, అలాంటి వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని కార్మిక సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ అన్నారు. వీధి వ్యాపారుల జీవనోపాధిని రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం వీధి వ్యాపారుల (జీవనోపాధి రక్షణ మరియు వీధి వ్యాపార నియంత్రణ) చట్టం--2014ను తీసుకొచ్చిందని, అయితే ఆ చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులే దానిని నిర్లక్ష్యం చేస్తూ వీధి వ్యాపారులను వేధించడం దురదృష్టకరమని ఆయన విమర్శించారు. షాద్‌నగర్‌లో రోడ్డు విస్తరణ పేరుతో జరిగిన చర్యల్లో ప్రధానంగా వీధి వ్యాపారుల డబ్బాలు, బండ్లనే తొలగించారని, అయితే పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టిన భవనాలపై అదే స్థాయిలో చర్యలు తీసుకున్నారా అనే ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. వీధి వ్యాపారులు ఇబ్బందికరమైన ప్రాంతాల్లో వ్యాపారం నిర్వహిస్తే, చట్టం ప్రకారం టౌన్ వెండింగ్ కమిటీ సమావేశమై వారికి ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కానీ షాద్‌నగర్‌లో అలాంటి విధానం అమలులో కనిపించడం లేదని ఆయన అన్నారు. చౌరస్తా ప్రాంతంలో సమస్య ఉందనే పేరుతో టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, పాల కేంద్రం గోడ సమీపంలో ఉన్న వీధి వ్యాపారుల డబ్బాలను పనికిరాకుండా ధ్వంసం చేశారని, అయితే అక్కడ ఆర్ అండ్ బీ శాఖ నిర్మించిన డ్రైనేజీ అవతలే ఆ డబ్బాలు ఉన్నాయని గుర్తు చేశారు. అదే ప్రాంతంలో ఎదురుగా ఉన్న ఒక బార్ అండ్ రెస్టారెంట్ గోడను మాత్రం కనీసం ముట్టుకోడానికి కూడా అధికారులు ధైర్యం చేయలేదని విమర్శించారు.
వీధి వ్యాపారుల పట్ల వివక్ష చూపుతూ, వారి జీవనోపాధిని దెబ్బతీసే విధంగా వ్యవహరించడం సమంజసం కాదని పినపాక ప్రభాకర్ పేర్కొన్నారు. వెంటనే వీధి వ్యాపారుల చట్టం--2014ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, ఇప్పటి వరకు చట్టాన్ని నిర్లక్ష్యం చేసి వీధి వ్యాపారులను ఇబ్బందులకు గురి చేసిన అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ అంశంపై త్వరలో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసి, వీధి వ్యాపారుల హక్కుల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు పినపాక ప్రభాకర్ తెలిపారు.

# ఆలయ పునర్నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలి

- ఆలయ ప్రాచీనతకు భంగం కలగకుండా అభివృద్ధి పనులు చేపట్టాలి
- భక్తులకు మెరుగైన దర్శన, మౌలిక వసతులు కల్పించేలా పనులు వేగవంతం చేయాలి
- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్

భద్రాద్రి కొత్తగూడెం

వచ్చే ఏడాది నిర్వహించనున్న గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో చేపడుతున్న పునర్నిర్మాణ అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ అంకిత్ భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ తో కలసి భద్రాచలం శ్రీ సీతా రామచంద్రస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న పునర్నిర్మాణ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో విస్తృతంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ పునర్నిర్మాణ అభివృద్ధి పనులకు ఈ ఏడాది





మార్చి నెలలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరిగినట్లు తెలిపారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని సమీక్షించేందుకు ఈ పర్యటన చేపట్టినట్లు తెలిపారు.

వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నాటికి ఆలయ అభివృద్ధి పనులను పూర్తిచేసే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతోందన్నారు. అన్ని పనులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా అవసరమైన పరిపాలనా సాంకేతిక ఆర్థిక చర్యలను సమన్వయంతో అమలు చేస్తున్నామని తెలిపారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా మరింత వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ఆలయ అభివృద్ధి పనుల పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు రోడ్లు భవనాల శాఖ నుంచి ప్రత్యేక అధికారిని నియమిస్తున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాచీనత ఆధ్యాత్మిక విశిష్టతకు భంగం కలగకుండా నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు.

భక్తులకు మెరుగైన దర్శన సౌకర్యాలు విశాలమైన రాకపోకల మార్గాలు ఆధునిక మౌలిక వసతులు కల్పించి గోదావరి పుష్కరాల నాటికి అన్ని ప్రధాన పనులను పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో భద్రాచలం తాసిల్దార్ రవికుమార్, పంచాయతీ ఈవో, ఆర్ అండ్ బి శాఖ ఈఈ నాగేశ్వరరావు, దేవాదాయ శాఖ అధికారులు, రోడ్లు భవనాల శాఖ ఇంజినీర్లు, సంబంధిత శాఖల అధికారులు నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోడౌన్ భద్రతను నిరంతరం పర్యవేక్షించాలి

- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్
- ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ

భద్రాద్రి కొత్తగూడెం


ఈవీఎం గోడౌన్ భద్రతను నిరంతరం పర్యవేక్షించాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లాలో ఈవీఎంల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రతి నెలా క్రమం తప్పకుండా గోడౌన్లను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంల భద్రత అత్యంత కీలకమైన అంశమని అందుకు అనుగుణంగా అన్ని భద్రతా



ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. తనిఖీలో భాగంగా ఈవీఎంలు, వీవీ ప్యాట్లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం సీసీ కెమెరా నియంత్రణ గదిని సందర్శించి కెమెరాల పనితీరు రికార్డింగ్ వ్యవస్థ విద్యుత్ బ్యాకప్ భద్రతా పర్యవేక్షణ ఏర్పాట్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గోడౌన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచడంతో పాటు భద్రతా ప్రమాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడకుండా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. గోడౌన్ వద్ద విధులు నిర్వహించే భద్రతా సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని అనుమతి లేని వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ గోడౌన్‌లోకి అనుమతించరాదని ఆదేశించారు. గోడౌన్ పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తూ లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం ఈవీఎం గోడౌన్ తనిఖీ రిజిస్టర్లను పరిశీలించి సంతకం చేశారు. ఈ తనిఖీలో కొత్తగూడెం ఆర్డీవో మధు, ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# పుచ్చకాయను ఆహారంలో భాగం చేసుకుంటే బరువు పెరుగుతారా వైద్యులు ఏమంటున్నారు

పుచ్చకాయ తియ్యగా ఉండటమే కాకుండా ఆరోగ్యానికి మేలు చేసే ఎన్నో పోషకాలను కలిగి ఉంటుంది. ముఖ్యంగా ఇందులో 92 శాతం నీరు ఉండటం వల్ల వేడి వాతావరణంలో శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచడంలో సహాయపడుతుంది. తీపి ఎక్కువగా ఉండటంతో పుచ్చకాయ తింటే బరువు పెరుగుతామని చాలామంది భావిస్తారు. అయితే ఇందులో కేలరీలు తక్కువగా ఉండటంతోపాటు బరువు తగ్గించే లక్షణాలు కూడా ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. పరిమితంగా తీసుకుంటేనే దీని ప్రయోజనాలను పూర్తిగా పొందవచ్చు. పుచ్చకాయలో కొవ్వు శాతం చాలా తక్కువగా ఉంటుంది. అంతేకాకుండా ఇందులో కొలెస్ట్రాల్ ఉండదు. బరువు తగ్గాలనుకునే వారు తక్కువ కొవ్వు ఉన్న ఆహారాలను ఎంచుకోవాలని సూచిస్తారు. ఈ కోణంలో పుచ్చకాయ మంచి ఎంపికగా చెప్పవచ్చు.



**కేలరీలు చాలా తక్కువ..**

పుచ్చకాయలో కేలరీలు కూడా చాలా తక్కువగా ఉంటాయి. ఒక కప్పు పుచ్చకాయలో కేవలం 46 కేలరీలు మాత్రమే ఉంటాయి. బరువు తగ్గాలంటే తీసుకునే కేలరీల కంటే ఖర్చు చేసే కేలరీలు ఎక్కువగా ఉండాలి. పుచ్చకాయలో 92 శాతం నీరు ఉండటం వల్ల తక్కువ కేలరీలతోనే కడుపు నిండిన భావన కలుగుతుంది. అలాగే తగినంత నీరు తీసుకోవడం జీవక్రియను (మెటబాలిజం) మెరుగుపరచడంలో కూడా సహాయపడుతుంది. పుచ్చకాయలో ఉండే సిట్రులిన్ అనే అమినో ఆమ్లం శరీరంలో అర్జినైన్‌గా మారుతుంది. అర్జినైన్ శరీరంలో కొవ్వు నిల్వలను తగ్గించి కండరాల నిర్మాణానికి తోడ్పడుతుందని వైద్యులు చెబుతున్నారు. వ్యాయామంతో పాటు సరైన ఆహారం తీసుకుంటేనే ఆశించిన ఫలితాలు వస్తాయి. పుచ్చకాయలో విటమిన్లు సి, ఎ, బి5, బి6తో పాటు మెగ్నీషియం, పొటాషియం వంటి పోషకాలు ఉంటాయి. ఇవి శరీరానికి అవసరమైన శక్తిని అందించి వ్యాయామం చేయడానికి సహాయపడతాయని పేర్కొంటున్నారు.

**జీర్ణ సమస్యలకు చెక్..**

పుచ్చకాయలో నీటి శాతం ఎక్కువగా ఉండటం వల్ల ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉంటుంది. దీంతో మధ్య మధ్యలో అనారోగ్యకరమైన చిరుతిండ్లు తినాలనే కోరిక తగ్గి, అధికంగా తినకుండా నియంత్రించుకోవడానికి ఉపయోగపడుతుంది. పుచ్చకాయలో కొవ్వు, కొలెస్ట్రాల్ తక్కువగా ఉండగా, పీచు పదార్థం మాత్రం ఉంటుంది. ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరచడంతో పాటు మలబద్ధకం సమస్యను తగ్గించడంలో సహాయపడుతుంది.

అలాగే ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలిగించి బరువు నియంత్రణకు తోడ్పడుతుంది. అయితే పుచ్చకాయను కూడా పరిమిత మోతాదులోనే తీసుకోవాలి. ఇందులో కేలరీలు తక్కువగా ఉన్నప్పటికీ సహజ చక్కెరలు ఉంటాయి. అందువల్ల రోజుకు రెండు కప్పుల వరకు మాత్రమే తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. దీనిని మధ్యాహ్న పు చిరుతిండిగా లేదా వ్యాయామం అనంతరం తీసుకోవచ్చు.

# ప్రవేశాలకు చివరి తేదీ ఖరారు



భద్రాద్రి కొత్తగూడెం

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ మొదటి సంవత్సరం ప్రవేశానికి గడువు చివరి తేదీ ఈనెల 7 వరకు ఇంటర్మీడియట్ సెకండియర్ పాస్ అయిన విద్యార్థులు డిప్లమా పాస్ అయిన విద్యార్థులు ఐటిఐ ఒకేషనల్ పాస్ అయిన విద్యార్థులు ప్రవేశానికి అర్హులని శ్రీ రామచంద్ర ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మ, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకట్ ఒక సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. అదేవిధంగా అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ రెండవ సంవత్సరము మూడో సంవత్సరము చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు ఆగస్టు 7వ తేదీ వరకు రుసుము చెల్లించాలని తెలియజేశారు

# అవకాడో ఆరోగ్య రహస్యాలు తెలిస్తే విడిచి పెట్టకుండా తింటారు ఎన్నో లాభాలు కలుగుతాయి



అవకాడో ఇటీవలి కాలంలో ఆరోగ్యకరమైన ఆహారంగా విపరీతమైన ఆదరణ పొందుతోంది. ఫిట్‌నెస్‌పై అవగాహన పెరగడంతోపాటు బరువు నియంత్రణకు ఉపయోగపడే ఆహారాల జాబితాలో అవకాడోకు ప్రత్యేక స్థానం లభించింది. ఇందులో ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉండటంతోపాటు బరువు తగ్గే ఆహార ప్రణాళికల్లో కూడా దీనిని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. అవకాడోను క్రమం తప్పకుండా ఆహారంలో చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని వైద్యులు చెబుతున్నారు. అవకాడోలో 20కిపైగా విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ముఖ్యంగా విటమిన్ కె, ఫోలేట్, పొటాషియం, విటమిన్ సి, విటమిన్ ఇ, విటమిన్ బి5, విటమిన్ బి6 సమృద్ధిగా లభిస్తాయి. అలాగే మెగ్నీషియం, మాంగనీస్, రాగి, ఇనుము, జింక్, ఫాస్ఫరస్, విటమిన్ ఎ వంటి పోషకాలు కూడా ఇందులో ఉంటాయి.

**గుండె ఆరోగ్యానికి..**

అవకాడోలో మోనో అన్‌శాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా ఒలీక్ యాసిడ్ అనే ఆరోగ్యకరమైన కొవ్వు శరీరంలోని వాపులను తగ్గించడంలో సహాయపడుతుందని పేర్కొంటున్నారు. ఈ కారణంగా అవకాడో గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుందని, అవకాడో నూనెను వంటల్లో కూడా ఉపయోగించవచ్చని తెలియజేస్తున్నారు. అవకాడో శరీరంలోని కొలెస్ట్రాల్ స్థాయిలను సమతుల్యం చేయడంలో సహాయపడుతుంది. ఇది ఎల్‌డీఎల్ (చెడు కొలెస్ట్రాల్), ట్రైగ్లిజరైడ్ల స్థాయిలను తగ్గించి, హెచ్‌డీఎల్ (మంచి కొలెస్ట్రాల్) స్థాయిలను పెంచడంలో దోహదపడుతుందని చెబుతున్నారు. దీంతో గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో ఇది ఉపయోగపడుతుంది.

**సులభంగా తీసుకోవచ్చు..**

అవకాడోను రోజువారీ ఆహారంలో సులభంగా చేర్చుకోవచ్చు. దీనిని సలాడ్లు, అవకాడో టోస్ట్ లేదా ఇతర వంటకాలలో ఉపయోగించవచ్చు. అవకాడో మృదువైన, క్రీమీ స్వభావం కలిగి ఉండటంతో ఇతర పదార్థాలతో సులభంగా కలిసిపోతుంది. వెల్లుల్లి, ఉప్పు, నిమ్మరసం వంటి పదార్థాలతో కలిపి గ్వాకమోలే అనే ప్రసిద్ధ డిప్‌ను కూడా తయారు చేసుకోవచ్చు. అవకాడోలో అరటిపండ్ల కంటే ఎక్కువ పొటాషియం ఉంటుంది. పొటాషియం శరీరంలోని కణాల పనితీరుకు అవసరమైన ఖనిజం. ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడటంతోపాటు గుండెపోటు, పక్షవాతం, మూత్రపిండాల సమస్యల ప్రమాదాన్ని తగ్గించడంలో దోహదపడుతుంది.

**కీళ్ల నొప్పులు తగ్గేందుకు..**


అవకాడో సారాలు కీళ్ల నొప్పులు, వాపులతో బాధపడే ఆస్టియోఆర్థరైటిస్ రోగులకు కొంత ఉపశమనం కలిగిస్తాయి. అవకాడోను బరువు తగ్గించే ఆహార ప్రణాళికల్లో ఎక్కువగా ఉపయోగిస్తారు. ఇందులో పీచు పదార్థం అధికంగా ఉండగా కార్బొహైడ్రేట్లు తక్కువగా ఉంటాయి. దీంతో ఎక్కువసేపు ఆకలి అవకుండా ఉండటానికి సహాయపడటంతోపాటు మొత్తం కేలరీల వినియోగాన్ని తగ్గించడంలో దోహదపడుతుంది. అవకాడోలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరచడంతోపాటు మలబద్ధకం సమస్యను నివారించడంలో సహాయపడుతుంది. అలాగే రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరగకుండా నియంత్రించడంలో కూడా ఉపయోగపడుతుంది. అవకాడోలో ల్యూటిన్, జియాజాంతిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి.

ఇవి కంటి ఆరోగ్యాన్ని కాపాడటంలో ముఖ్యపాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా వృద్ధాప్యంలో వచ్చే ప్రమాదాన్ని తగ్గించడంలో ఇవి సహాయపడతాయనినిపుణులు చెబుతున్నారు.

# హరీశ్ రావుపై క్షుద్ర పూజల ఆరోపణలపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లు సిద్దిపేట శాసనసభ్యుడు, ప్రతిపక్ష నేత హరీశ్ రావుపై బహిరంగంగా చేసిన 'క్షుద్ర పూజలు /తాంత్రిక పూజలు' నిర్వహించారన్న ఆరోపణలపై, న్యాయవాది, సామాజిక కార్యకర్త కారుపోతుల రేవంత్ జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయ భారతి సాయనీకి ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా రేవంత్ మీడియాతో మాటాడుతూ.. శివమొగ్గ, తిరుచ్చిరాపల్లిలో హరీశ్ రావు క్షుద్ర పూజలు నిర్వహించారని, తెలంగాణలో వర్షాలు పడకుండా, రైతులు నష్టపోయేలా చేసేందుకే ఈ పూజలు చేశారని గాంధీ భవన్ వేదికగా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఎలాంటి ఆధారాలు బహిరంగంగా ప్రదర్శించకుండా తీవ్ర ఆరోపణలు చేశారు. ఇదే తరహాలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కూడా సామాజిక మాధ్యమాల్లో వీడియో ద్వారా ఇలాంటి ఆరోపణలు చేశారు. రాజ్యాంగబద్ధమైన, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు, ఎలాంటి రుజువులు లేకుండా ఇలాంటి ఆరోపణలు చేయడం ఒక ప్రజాప్రతినిధి గౌరవాన్ని, మానవ హక్కులను




ఉల్లంఘించడమేనని రేవంత్ అభిప్రాయపడ్డారు. గ్రామీణ తెలంగాణలో నేటికీ క్షుద్ర పూజలు, చేతబడి వంటి మూఢనమ్మకాల కారణంగా అమాయక ప్రజలు హత్యలకు గురైన సంఘటనలు అనేకం జరిగాయని, ప్రభుత్వం, పోలీసు శాఖ ఇలాంటి మూఢనమ్మకాలపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉన్న ప్రజాప్రతినిధులే ఇలాంటి ప్రకటనలు చేయడం ఆ ప్రయత్నాలను దెబ్బ తీసేలా, సమాజంలో ఇలాంటి నేరాలను ప్రోత్సహించేలా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

# రహానేపై సునీల్ గవాస్కర్ ప్రశంసల జల్లు

టీమిండియా మాజీ క్రికెటర్ అజింక్యా రహానేపై దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ ప్రశంసల జల్లు కురిపించాడు. భారత క్రికెట్‌లో అజింక్యా రహానే అజాత శత్రువని కొనియాడాడు. రహానే సగర్వంగా ఆట నుంచి నిష్క్రమించాడని కొనియాడాడు. అయినా రహానేకు భారత క్రికెట్‌లో అన్యాయమే జరిగిందని, రావాల్సిన గుర్తింపు రాలేదని పేర్కొన్నాడు. ఇటీవల అజింక్యా రహానే అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. తన నిర్ణయాన్ని వెల్లడిస్తూ రహానే భావోద్వేగానికి గురయ్యాడు. రహానే రిటైర్మెంట్‌పై తాజాగా స్పందించిన గవాస్కర్.. రాహుల్ ద్రవిడ్ తరహాలోనే అతని సారథ్యానికి తగిన గుర్తింపు రాలేదని అభిప్రాయపడ్డాడు. 'కెప్టెన్‌గా అజింక్యా రహానేకు అద్భుతమైన రికార్డ్ ఉంది. అతను 6 టెస్ట్‌లకు కెప్టెన్సీ చేస్తే.. నాలుగు విజయాలు సాధించాడు. ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోలేదు. రాహుల్ ద్రవిడ్ సారథ్యంలోనూ భారత్ అద్భుతమైన విజయాలు సాధించింది. కానీ అతనికి దక్కాల్సిన గుర్తింపు రాలేదు. అలాగే రహానే నాయకత్వానికి కూడా గుర్తింపు లభించలేదు. అయితే భారత క్రికెట్‌లో ఇది సర్వసాధారణం. జట్టు గెలిచినప్పుడు వ్యక్తిగత ప్రదర్శనలను కొనియాడటం.. ఓడినప్పుడు మాత్రం కెప్టెన్, కోచ్‌లను నిందించడం సాధారణమే. 2021 ఆస్ట్రేలియా పర్యటనలో తొలి టెస్ట్‌లో టీమిండియా 36 పరుగులకే ఆలౌటై ఘోర పరాజయం మూటగట్టుకుంది. ఆ తర్వాత కోచ్ రవిశాస్త్రితో కలిసి రహానే జట్టును మెరుగైన స్థితికి చేర్చాడు. ఆస్ట్రేలియాకు కంచుకోట లాంటి బ్రిస్బేన్ గబ్బా మైదానంలో భారత్‌కు చిరస్మరణీయమైన విజయాన్ని అందిచి సిరీస్ అందించాడు. వాస్తవానికి గబ్బా టెస్ట్‌కు స్టార్ ఆటగాళ్లంతా గాయాలు, వ్యక్తిగత కారణాలతో అందుబాటులో లేకుండా పోయారు. అయినా కుర్రాళ్లతో రహానే జట్టును అద్భుతంగా నడిపించి గొప్ప విజయాన్ని అందించాడు. రహానే నిస్వార్థమైన ఆటతీరుకు అభిమానుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. అతను సగర్వంగా ఆట నుంచి వైదొలిగాడు. ఆటలో ఒక్క శత్రువు కూడా లేని క్రికెటర్లు నాకు తెలిసి అరడజను కంటే తక్కువమందే ఉంటారు. వారిలో రహానే ఒకడు'అని గవాస్కర్ పేర్కొన్నాడు.



# కోహ్లీ లాంటి ప్లేయర్ మళ్లీ దొరకడు



## • కోహ్లీపై రవిశాస్త్రి ప్రశంసల వర్షం

భారత క్రికెట్ దిగ్గజం క్రికెటర్‌పై మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి ప్రశంసల వర్షం కురిపించారు. అలాంటి ఆటగాడు భారత క్రికెట్‌కు మళ్లీ దొరకడం చాలా కష్టమని, అతను జట్టుకు చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. అతను భారత జట్టుకు ఇన్ని సంవత్సరాలు ఆడటం దేశ క్రికెట్‌కు దక్కిన అదృష్టమని ఆయన పేర్కొన్నారు. ఇంతకీ ఆ ప్లేయర్ ఎవరు అని అనుకుంటున్నారా? ఇంకెవరు కింగ్ విరాట్ కోహ్లీ.రవిశాస్త్రి మాట్లాడుతూ.. "ఇన్ని సంవత్సరాలుగా విరాట్ కోహ్లీ భారత క్రికెట్‌కు లభించడం అదృష్టమని, అతని లేకపోవడం అతని గొప్పతనాన్ని మరింతగా చాటిచెబుతుందని తాను నమ్ముతున్నానని, అతనిలాంటి ఆటగాడు భారత క్రికెట్‌కు మరెన్నడూ దొరకడని రవిశాస్త్రి అన్నారు." అని అన్నారు. అలాగే ఒక వ్యక్తి విలువ అతను ఉన్నప్పుడు కంటే, అతను లేకపోయిన తర్వాతే ఎక్కువగా అర్థమవుతుందని వ్యాఖ్యానించారు. కోహ్లీ కూడా అలాంటి ఆటగాడేనని, అతను జట్టులో లేకపోవడం ద్వారా అతని గొప్పతనం ఎంతటిదో అభిమానులు, క్రికెట్ ప్రపంచం మరింతగా గుర్తిస్తాయని చెప్పారు.టెస్టు, వన్డే, టీ20 ఫార్మాట్లలో కోహ్లీ సాధించిన పరుగులు, ఎన్నో చారిత్రాత్మక విజయాల్లో పోషించిన పాత్ర, భారత జట్టును ప్రపంచ క్రికెట్‌లో అగ్రశ్రేణి జట్టుగా నిలబెట్టడంలో అతని కృషి ఎప్పటికీ గుర్తుండిపోతాయని రవిశాస్త్రి కొనియాడారు. కోహ్లీ కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడు రవిశాస్త్రి భారత జట్టు హెడ్ కోచ్‌గా పనిచేశారు. ఈ ఇద్దరి కలయికలో భారత్ విదేశాల్లో చారిత్రాత్మక టెస్టు విజయాలు నమోదు చేయడంతో పాటు, ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ గెలిచి చరిత్ర సృష్టించింది. అందుకే కోహ్లీ సామర్థ్యం, నాయకత్వం గురించి రవిశాస్త్రి చేసిన వ్యాఖ్యలకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. రవిశాస్త్రి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# అత్యంత ఖరీదైన ప్లేయర్‌గా బెన్ స్టోక్స్

న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్ ఓటమి అనంతరం ఇంటర్నేషనల్ క్రికెట్?కు వీడ్కోలు పలికిన ఇంగ్లాండ్ మాజీ టెస్టు కెప్టెన్, స్టార్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టబోతున్నారు. జూన్ 2026లో ఇంటర్నేషనల్ క్రికెట్ నుంచి తప్పుకున్న 35 ఏళ్ల ఈ లెజెండ్ ప్లేయర్, క్రికెట్‌కు పూర్తిగా దూరం కావడం లేదని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా జరిగే వివిధ లీగ్‌లు, ఫ్రాంచైజీ టోర్నమెంట్లలో కొనసాగాలని నిశ్చయించుకున్నారు. రిటైర్మెంట్ ప్రకటించగానే నేరుగా కోచింగ్ లేదా కామెంట్రీ వైపు వెళ్లకుండా, యాక్టివ్ ప్లేయర్‌గానే మైదానంలో అడుగుపెట్టాలని ఆయన నిర్ణయించుకోవడం అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ టీ20 లీగ్ బిగ్ బాష్ లీగ్లో ఆడేందుకు బెన్ స్టోక్స్ విపరీతమైన ఆసక్తి చూపిస్తున్నారు. కోడ్ స్పోర్ట్స్ నివేదిక ప్రకారం.. అనేక బీబీఎల్ ఫ్రాంచైజీలు ఈ స్టార్ ఆల్‌రౌండర్‌ను తమ జట్టులోకి తీసుకునేందుకు తీవ్రంగా పోటీపడుతున్నాయి. ఇందులో 2026/27 సీజన్ కోసం బెన్ స్టోక్స్‌ను సైన్ చేసే రేసులో సిడ్నీ సిక్సర్స్ అందరికంటే ముందుంది. ఇంగ్లాండ్ మాజీ వైట్-బాల్ కోచ్ మాథ్యూ మోట్ ప్రస్తుతం సిడ్నీ సిక్సర్స్ జట్టుతో ఉండటం వారికొక పెద్ద అడ్వాంటేజ్‌గా మారింది. వీరిద్దరి కాంబినేషన్‌లోనే ఇంగ్లాండ్ జట్టు ఆస్ట్రేలియాలో 2022 టి20 ప్రపంచ కప్‌ను గెలుచుకుంది. ఆనాడు మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో పాకిస్థాన్‌తో జరిగిన ఫైనల్లో స్టోక్స్ నాటౌట్‌గా 52 రన్స్ చేసి మ్యాచ్ విన్నర్‌గా నిలిచారు. బెన్ స్టోక్స్‌కు బిగ్ బాష్ లీగ్ కొత్తేమీ కాదు. ఆయన గతంలో 2014/15 సీజన్‌లో మెల్‌బోర్న్ రెనెగేడ్స్ తరఫున ఆడి తన సత్తా చాటారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో సిడ్నీ సిక్సర్స్‌తో పాటు హోబార్ట్ హరికేన్స్ కూడా స్టోక్స్‌ను దక్కించుకోవాలని ఆరాటపడుతోంది. క్రికెట్ టాస్మానియా మేనేజ్‌మెంట్ ఇప్పటికే ఈ ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్‌ను తమ జట్టు వైపు తిప్పుకోవడానికి ప్రయత్నాలు మొదలుపెట్టింది. ప్రస్తుతం స్టోక్స్ తన హోమ్ కౌంటీ అయిన దర్హామ్ జట్టు తరఫున కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో రాణిస్తున్నారు. ఈ భారీ డీల్ విలువ దాదాపు 600,000 ఆస్ట్రేలియన్ డాలర్లు ఉండవచ్చని సమాచారం. రాబోయే బీబీఎల్ సీజన్లలో కనీసం కొన్ని మ్యాచ్‌లకైనా స్టోక్స్ ఆడేలా ఒప్పందం కుదుర్చుకోవాలని క్రికెట్ ఆస్ట్రేలియా భావిస్తోంది. ఈ డీల్ గనుక పూర్తయితే, బిగ్ బాష్ లీగ్ చరిత్రలోనే అత్యంత భారీ ధర పొందిన విదేశీ క్రికెటర్‌గా బెన్ స్టోక్స్ ఆల్-టైమ్ రికార్డు సృష్టిస్తారు.

# ఐదేళ్ల ప్రయాణం చిరస్మరణీయం..

## • టీమిండియా ఫీల్డింగ్ కోచ్ దిలీప్ భావోద్వేగం!

టీమిండియా ఫీల్డింగ్ కోచ్ బాధ్యతల నుంచి తప్పుకున్న టీ దిలీప్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యాడు. టీమిండియా ఫీల్డింగ్ కోచ్‌గా తన ప్రయాణం ముగిసిందని, ఈ ఐదేళ్లు తన జీవితంలో మధుర జ్ఞాపకంగా మిగిలిపోతాయని పేర్కొన్నాడు. హైదరాబాద్‌కు చెందిన టీ దిలీప్ 2021లో టీమిండియా ఫీల్డింగ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. తన హయాంలో జట్టులో అద్భుతమైన మార్పు తీసుకొచ్చాడు. ముఖ్యంగా డ్రెస్సింగ్ రూమ్‌లో బెస్ట్ ఫీల్డర్ అవార్డ్‌ను ప్రవేశపెట్టి ఆటగాళ్లలో పోటీతత్వాన్ని పెంచాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 తర్వాత టీమిండియా ఫీల్డింగ్ ప్రమాణాలు పడిపోయాయి. ముఖ్యంగా ఇంగ్లండ్, ఐర్లాండ్ పర్యటనల్లో భారత జట్టు ఘోర పరాజయాలను చవిచూడటంతో టీ దిలీప్ కాంట్రాక్ట్‌ను బీసీసీఐ పొడిగించలేదు. దాంతో అతని స్థానంలో శుభదీప్ ఘోష్ నూతన ఫీల్డింగ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే దిలీప్ తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా సుదీర్ఘ పోస్ట్‌ను పంచుకున్నాడు. తనకు సహకరించిన కెప్టెన్లు, కోచ్‌లు, ఆటగాళ్లతో పాటు బీసీసీఐ కృతజ్ఞతలు తెలిపాడు.'ఈ ఐదేళ్ల ప్రయాణం గురించి చెప్పడానికి మాటలు సరిపోవు.



టీమిండియా సపోర్ట్ స్టాఫ్‌లో చేరే ముందే.. నా సర్వస్వం ఇవ్వాలని భావించాను. తొలి రోజు నుంచి అదే లక్ష్యంతో పనిచేశాను. ఫీల్డింగ్ కోచ్‌గా జట్టుతో ప్రయాణం చేయడం పట్ల నేను కృతజ్ఞుడినై ఉంటాను. ఫీల్డింగ్ మెడల్ అనేది మా మనసులో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఈ మెడల్ ప్రదానం ద్వారా డ్రెస్సింగ్ రూమ్‌లో ఒక ఆహ్లాదకర వాతావరణం సృష్టించాం. ఫీల్డింగ్ కోచ్‌గా ఈ జ్ఞాపకాలు నా మదిలో ఎప్పటికి నిలిచిపోతాయి. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2024, 2026, ఛాంపియన్స్ ట్రోఫీ 2025, ఆసియా కప్ 2023, 2025 ట్రోఫీలు గెలిచిన భారత జట్టులో నేను భాగమే. ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2023, వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్ చేరిన జట్టులో కూడా ఉన్నాను. ఈ ప్రయాణం నాకెన్నో చిరస్మరణీయమైన జ్ఞపకాలను ఇచ్చింది. నాకు ఈ అవకాశం ఇచ్చిన బీసీసీఐకి ప్రత్యేక ధన్యవాదాలు.నాపై నమ్మకం ఉంచి కొనసాగించిన రాహుల్ ద్రవిడ్, గౌతమ్ గంభీర్‌కు కృతజ్ఞతలు. ఈ ఇద్దరితో కలిసి పనిచేయడం గొప్ప అనుభవం. రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, విరాట్ కోహ్లీ, హార్దిక్ పాండ్యా, శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్.. కెప్టెన్లుగా ఉన్న సమయంలో భారత క్రికెట్‌కు నా వంతు సేవ చేయడాన్ని గొప్పగా భావిస్తు న్నా. ఈ ప్రయాణంలో నాతో ఉన్న ప్రతీ ఆటగాడు, కోచ్, సహాయక సిబ్బందిలోని ప్రతీ ఒక్కరికి ధన్యవా దాలు. ఇప్పుడిక ఈ అధ్యాయం ముగిసిపోయింది. నా ప్రయాణం మాత్రం కొనసాగుతోంది.'అని టీ దిలీప్ ఏమోషనల్‌గా రాసుకొచ్చాడు.

# సింధుకు తొమ్మిదో సీడ్



## సాత్విక్, చిరాగ్ జోడికి ఐదో సీడ్

## బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్స్

**న్యూఢిల్లీ:** భారత అగ్రశ్రేణి షట్లర్, జపాన్ ఓపెన్ విజేత పి.వి సింధుకు రానున్న బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో ఐదో సీడ్ లభించింది. 2022 ఆసియా గేమ్స్ చాంపియన్స్ సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడికి ఐదో సీడ్ దక్కింది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్‌కు 14వ సీడ్, మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల, తనీశ క్రాస్టోలకు 15వ సీడ్ లభించింది. ఆగస్టు 17 నుంచి 23 వరకు న్యూఢిల్లీ వేదికగా ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్ జరుగనున్నాయి. ఆతిథ్య దేశంగా భారత్ నుంచి ప్రతి విభాగంలో ఇద్దరు పోటీపడనున్నారు. ఏప్రిల్ 28 ప్రపంచ ర్యాంకింగ్స్ ప్రకారం షట్లర్లు టోర్నమెంట్‌కు అర్హత సాధించగా.. జులై 28 వరల్డ్ ర్యాంకింగ్స్ ప్రకారం మంగళవారం సీడింగ్ కేటాయించారు. మహిళల, పురుషుల సింగిల్స్‌తో పాటు పురుషుల, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో కనీసం ఓ భారత షట్లర్‌కు సీడింగ్ లభించింది.ప్రపంచ చాంపియన్ షి యుకి (చైనా) పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్‌గా నిలువగా.. దక్షిణ కొరియా అగ్రషట్లర్ అన్‌సె యంగ్‌కు నం.1 సీడింగ్ కేటాయించారు. మహిళల సింగిల్స్‌లో ప్రపంచ చాంపియన్ అకానె యమగూచి (జపాన్) రెండో సీడ్‌గా బరిలోకి దిగనుండగా.. చైనా షట్లర్లు వాంగ్ జి యి, చెన్ యుఫెయ్‌లు వరుసగా 3, 4వ సీడింగ్ సాధించారు. ప్రపంచ చాంపియన్‌షిప్స్ డ్రా బుధవారం జరుగనుండగా.. ఈలోపు సీడింగ్ దక్కిన ఆటగాళ్లు ఎవరైనా పోటీ నుంచి తప్పుకుంటే సీడింగ్ ఆర్డర్ మారే అవకాశం ఉంది.

## అప్పుడు క్లాప్ అసిస్టెంట్.. ఇప్పుడు అదే హీరోకి ప్రొడ్యూసర్..

# నానిది అసలైన విజయం!

సినీ పరిశ్రమలో ఎవరి జాతకం ఎప్పుడు ఎలా మారుతుందో చెప్పలేం. ఒకప్పుడు క్లాప్ అసిస్టెంట్‌గా పనిచేసిన వ్యక్తి, రెండు దశాబ్దాల తర్వాత అదే హీరోతో సినిమా నిర్మించే స్థాయికి ఎదగడం నిజంగా ఓ అద్భుతం. అలాంటి స్ఫూర్తిదాయక ప్రయాణమే నేచురల్ స్టార్ నానిది. హీరో నితిన్ కథానాయకుడిగా, నాని సమర్పణలో 'అలియాస్ రుక్మిణీ' అనే కొత్త చిత్రం నిన్న హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని యూనానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఓ ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. సుమారు 21 ఏళ్ల క్రితం, 2005లో కె. రాఘవేంద్రరావు దర్శకత్వంలో నితిన్ హీరోగా నటించిన 'అల్లరి బుల్లోడు' సినిమాకు నాని క్లాప్ అసిస్టెంట్‌గా పనిచేశారు. అప్పట్లో నితిన్‌పై చిత్రీకరించిన సన్నివేశాలకు క్లాప్ కొట్టిన నాని, ఇప్పుడు అదే నితిన్ సినిమాకు నిర్మాతగా మారి ముహూర్తపు షాట్‌కు క్లాప్ కొట్టడం విశేషం. ఈ రెండు సందర్భాలకు సంబంధించిన ఫొటోలను పోలుస్తూ.. 'ఇదే కదా అసలైన సక్సెస్' అంటూ అభిమానులు సోషల్ మీడియాలో ప్రశంసలు కురిపిస్తున్నారు. దర్శకుడు కావాలనే లక్ష్యంతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన నాని, లెజెండరీ డైరెక్టర్ బాపు వద్ద 'రాధా గోపాళం' సినిమాకు, ఆ తర్వాత రాఘవేంద్రరావు వద్ద డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేశారు. ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా స్వయంకృషితో పైకొచ్చారు. అనుకోకుండా 'అష్టా చమ్మా' చిత్రంతో హీరోగా మారి, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ, సినిమా సినిమాకు తన నటనను మెరుగుపరుచుకుంటూ ప్రేక్షకుల హృదయాల్లో పక్కింటి కుర్రాడిగా స్థానం సంపాదించారు. ఒకప్పుడు మినిమమ్ గ్యారెంటీ హీరోగా పేరు తెచ్చుకున్న నాని, ఇప్పుడు రూ.100 కోట్ల మార్కెట్ ఉన్న స్టార్‌గా ఎదిగారు. హీరోగానే కాకుండా నిర్మాతగానూ అభిరుచి గల చిత్రాలను నిర్మిస్తున్నారు. ఒకప్పుడు క్లాప్ అసిస్టెంట్‌గా ఉన్న స్థాయి నుంచి, అదే హీరోతో సినిమా నిర్మించే స్థాయికి ఎదగడం ఆయన పట్టుదలకు, కష్టానికి నిదర్శనం. త్వరలో ఆయన మెగాస్టార్ చిరంజీవితోనూ ఓ సినిమా చేయనుండటం ఆయన కెరీర్‌లో మరో మైలురాయిగా నిలవనుంది.






## శంకర్ కుమార్తె అదితి కొత్త చిత్రం 'వన్స్ మోర్'...

ప్రముఖ దర్శకుడు శంకర్ కుమార్తెగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి, నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న అదితి శంకర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కొత్త చిత్రం 'వన్స్ మోర్'. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఈ రొమాంటిక్ డ్రామా విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. అర్జున్ దాస్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాను ఆగస్టు 28న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్టు వెల్లడించింది. విఘ్నేశ్ శ్రీకాంత్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా విడుదల తేదీ ప్రకటనతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మిలియన్ డాలర్ స్టూడియోస్ తమ సోషల్ మీడియా ద్వారా ఈ విషయాన్ని పంచుకుంది. "పండగ రోజు ఇదే. నిరీక్షణకు తెరపడి ప్రేమ మొదలయ్యే చోటు. మా ప్రేమ క్యాలెండర్‌లో ఇష్టమైన తేదీ దొరికింది. 'వన్స్ మోర్' ఆగస్టు 28న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది" అని పోస్ట్ చేసింది. ఈ సినిమాకు పలు ఆకర్షణలు ఉన్నాయి. ముఖ్యంగా, మలయాళంలో 'హృదయం', తెలుగులో 'హాయ్ నాన్న' వంటి చిత్రాలతో చార్ట్‌బస్టర్ ఆల్బమ్స్ అందించి సంచలనం సృష్టించిన ప్రముఖ సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్, ఈ సినిమాతో తమిళ చిత్ర పరిశ్రమకు పరిచయం అవుతున్నారు. ఇప్పటికే విడుదలైన కొన్ని పాటలు సంగీత ప్రియులను ఆకట్టుకుంటున్నాయి. అర్జున్ దాస్, అదితి శంకర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రంలో మోడల్, నటి సోనా ఒలికల్ ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాకు అరవింద్ విశ్వనాథన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, నాష్ ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు. రాజ్ కమల్ ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. మిలియన్ డాలర్ స్టూడియోస్ పతాకంపై యువరాజ్ గణేశన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హరీశ్ దురైరాజ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా, విజయ్ ఎంపీ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.

## నా పర్సనల్ లైఫ్ గురించి మీకేం తెలుసు?

### : పుకార్లపై అనుపమ పరమేశ్వరన్ ఘాటు స్పందన



యంగ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ ఇటీవల సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్న సందేశాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. తమిళ నటుడు ధృవ్ విక్రమ్‌తో ప్రేమాయణం ముగిసిందని, ఆ బ్రేకప్ బాధలోనే ఆవేదనతో కూడిన పోస్టులు పెడుతోందంటూ నెట్టింట పుకార్లు వైరల్ అయ్యాయి. ఈ వార్తలపై తాజాగా ఒక ఇంటర్వ్యూలో స్పందించిన అనుపమ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. "నా అధికారిక సోషల్ మీడియా ఖాతాలో ఏం పోస్ట్ చేయాలనేది పూర్తిగా నా వ్యక్తిగత హక్కు, నా సొంత నిర్ణయం. నా బాధను ఇతరుల ముందు ప్రదర్శించి సానుభూతి పొందాల్సిన అవసరం నాకు లేదు. ఒక సాధారణ మహిళగా జీవితంలో ఎదుర్కొనే మార్పుల గురించే నేను మాట్లాడాను. ఆ మార్పులను సమాజంతో ధైర్యంగా పంచుకోవడం నాకు గర్వంగా అనిపిస్తోంది. నా జీవితం, నా పర్సనల్ లైఫ్ గురించి బయట ఉన్న మీకేం తెలుసు? ఇది నా ఇన్‌స్టాగ్రామ్, నాకు నచ్చినవి నేను పోస్ట్ చేసుకుంటాను. నన్ను ప్రశ్నించడానికి మీరెవరు?" అంటూ ఆమె ఘాటుగా సమాధానమిచ్చింది. మరోవైపు రొటీన్ కథలకు భిన్నమైన ప్రాజెక్టులను ఎంచుకుంటున్న అనుపమ, ప్రస్తుతం 'క్రేజీ కల్యాణం' అనే చిత్రంలో నటిస్తోంది. దర్శకుడు బద్రప్ప సారథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో తరుణ్ భాస్కర్, నరేశ్, అఖిల్ ఉడ్డెమారి కీలక పాత్రలు పోషిస్తున్నారు. పర్సనల్ లైఫ్‌పై వచ్చిన వదంతులకు సూటిగా చెక్ పెట్టిన అనుపమ వ్యాఖ్యలు ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి.

## విశ్రాంతి తీసుకుంటున్న తారక్..

### నాన్ స్టాప్ గా జరుగుతున్న 'డ్రాగన్' షూటింగ్



టాలీవుడ్ అగ్ర కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ భుజానికి గాయమైన సంగతి తెలిసిందే. వైద్యుల సలహా మేరకు ప్రస్తుతం ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. డాక్టర్ల పర్యవేక్షణలో మెరుగైన చికిత్స అందుతుండగా, మరో రెండు వారాల పాటు ఆయన షూటింగ్‌కు దూరంగానే ఉండే అవకాశం ఉందని సినీ వర్గాలు వెల్లడించాయి. హీరో అందుబాటులో లేనప్పటికీ ఆయన నటిస్తున్న 'డ్రాగన్' చిత్ర బృందం పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా ముందడుగు వేస్తోంది. సమయం వృథా కాకుండా నాన్-స్టాప్ షూటింగ్ కొనసాగిస్తోంది. ప్రస్తుతం ఎన్టీఆర్ లేని సన్నివేశాలను దర్శకుడు ప్రశాంత్ నీల్ చిత్రీకరిస్తున్నట్లు ఇండస్ట్రీ టాక్. ఆయన పూర్తి కోలుకుని సెట్స్‌లో అడుగుపెట్టిన వెంటనే ఆయనకు సంబంధించిన కీలక ఘట్టాలను చిత్రీకరించేలా ప్లాన్ చేస్తున్నారు. కాగా, ఈమధ్య కాలంలో టాలీవుడ్‌లో వరుసగా నటీనటులు గాయపడటం అభిమానులను కలవరపెడుతోంది. ఇటీవల సీనియర్ బాలకృష్ణ, రష్మిక మందన్న, రామ్ చరణ్ కూడా గాయపడిన సంగతి తెలిసిందే.

## జ్యోతిక నాపై నమ్మకం ఉంచింది..

### అందుకే ఆ సాహసం చేశా: సూర్య



స్టార్ హీరో సూర్య తన 'కరుప్పు' సినిమా విడుదల సమయంలో ఎదుర్కొన్న తీవ్ర ఆర్థిక కష్టాల గురించి తాజాగా వెల్లడించారు. సినిమా విడుదలకు చివరి నిమిషంలో అదనపు రుణాలు తీసుకోవాల్సి వచ్చిందని, ఆ క్లిష్ట సమయంలో తన భార్య జ్యోతిక అండగా నిలబడిందని ఆయన తెలిపారు.

ఆర్‌జే బాలాజీ దర్శకత్వంలో త్రిషతో కలిసి సూర్య నటించిన 'కరుప్పు' చిత్రం 2026 మే 14న విడుదల కావాల్సి ఉండగా, కొన్ని ఆర్థిక సమస్యల కారణంగా ఒకరోజు ఆలస్యమైంది. తమిళనాడులో పంపిణీకి సంబంధించిన లావాదేవీలు కొలిక్కి రాకపోవడంతో ఆ రోజు ఉదయం షోలు రద్దయ్యాయి. దీంతో సూర్య స్వయంగా రంగంలోకి దిగి, వ్యక్తిగతంగా భారీ మొత్తం చెల్లించడంతో పాటు అదనపు నిధులు సమకూర్చి మే 15న సినిమాను విడుదల చేశారు. అనేక అడ్డంకులను దాటుకుని విడుదలైన ఈ చిత్రం, బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించి సంచలన విజయం నమోదు చేసింది.

ఈ నేపథ్యంలో 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సూర్య ఆనాటి పరిస్థితులను గుర్తుచేసుకున్నారు. "ఈ విషయంలో జ్యోతికకు థ్యాంక్స్ చెప్పాలి. అది చాలా పెద్ద ఆర్థిక భారం. చివరి నిమిషంలో నా మీద పడింది. నేను అదనపు రుణాలు తీసుకుంటున్నప్పుడు ఆమె నాపై నమ్మకం ఉంచింది. ఒకవేళ ఏదైనా తేడా వస్తే, కుటుంబంగా మేమంతా కష్టాలు పడాల్సి వచ్చేది. అయినా ఆమె నా నిర్ణయాన్ని నమ్మింది" అని సూర్య వివరించారు. అయితే, జ్యోతిక మాత్రం ఈ ప్రశంసను స్వీకరించలేదు. "ఈ క్రెడిట్ నేను తీసుకోను. ఇదంతా పూర్తిగా ఆయన కృషే. సినిమాను విజయవంతం చేయాలనే ఆయన ఔదార్యం వల్లే ఇది సాధ్యమైంది" అని ఆమె బదులిచ్చారు. ఈ విజయం వెనుక దర్శకుడు ఆర్‌జే బాలాజీ, ఇతర ఫైనాన్షియర్ల కృషి కూడా ఉందని సూర్య పేర్కొన్నారు.

## ఫ్యామిలీ మెలోడీతో వచ్చిన రవితేజ..

### 'ఇరుముడి' నుంచి కొత్త పాట

మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న కొత్త చిత్రం 'ఇరుముడి' నుంచి మేకర్స్ రెండో పాటను విడుదల చేశారు. 'యాలాలలో యాలాలలో' అంటూ సాగే ఈ మెలోడీ సింగిల్‌ను తాజాగా విడుదల చేశారు. కుటుంబ భావోద్వేగాలతో కూడిన ఈ పాట శ్రోతలను ఆకట్టుకుంటోంది.

ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తుండగా, ఈ పాటకు అనంత శ్రీరామ్ సాహిత్యం సమకూర్చారు. ప్రముఖ గాయకులు హేశం అబ్దుల్ వహాబ్, సాధిక కలిసి ఆలపించారు. తెలుగుతో పాటు తమిళంలో కూడా 'మనసు తన్నాలా' పేరుతో ఈ పాటను ఏకకాలంలో విడుదల చేశారు.

'ఇరుముడి' చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. సాయి కుమార్, బేబీ నక్షత్ర, అజయ్ ఘోష్ కీలక పాత్రలలో కనిపించనున్నారు. ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసిన చిత్రబృందం, ఆగస్ట్ 21న ఈ సినిమాను థియేటర్లలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.




Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com